W W W.EPAPER.MAHADAILY.COM
మహా పత్రిక
ఖమ్మం
భద్రాద్రి కొత్తగూడెం
14-10-2025





ఖమ్మం డిగ్రీ కాలేజ్ మైదానం

# దోపిడీ కేంద్రమా?

- బాణాసంచా సిండికేట్ మాయాజాలం బహిర్గతం..!
- అధికారుల పేర్లతో అక్రమ వసూళ్లు..!
- ప్రతి షాపు నుంచి 30 వేల దాకా వసూల్..!
- ప్రభుత్వ స్థలం ప్రైవేట్ ముఠా ఆధీనంలో..!

ఖమ్మం నగరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం ఇప్పుడు విద్యా క్షేత్రం కాదు, వసూళ్ల అడ్డాగా మారిపోయిందనే ఆరోపణలు ఊపందుకున్నాయి. ప్రభుత్వ భూమిలో ప్రజల భద్రత పేరుతో, అధికారులు పేరుతో, మున్సిపల్ ముద్రతో సిండికేట్ ముఠా బాణాసంచా వ్యాపారాల పేరుతో అక్రమ వసూళ్ల సిందూరం రాసుకుంటోందట.



# నేలకొరుగుతున్న చెట్లు

- గుండెపుడి బీట్ కాకర్ల ప్రాంతంలో యంత్రాల రణగోస
- అక్రమంగా తరలుతున్న కలప
- పట్టించుకోని ఫారెస్ట్ అధికారులు



**జూలూరుపాడు, అక్టోబర్ 12, (మహా):** అడవిలోకి అడుగు పెట్టాలంటే అటవీశాఖ పేరు చెబితేనే ఒకప్పుడు దొంగలు భయపడేవారు. అనుమతి లేకుండా. అడవిలోకి ప్రవేశించే వారికి ఆ శాఖ ఒకప్పుడు వణుకు పుట్టించేది. నిన్న మొన్నటిదాకా ఏ చెట్టు నరకాలన్నా సామాన్య జనం సైతం భయపడేవారు. ఇళ్లలో, పొలాల్లో పెంచుకున్న కొన్ని జాతుల చెట్లను సైతం నరకాలంటే అధికారుల అనుమతులు కచ్చితంగా తీసుకోవాల్సిందే. ప్రజల కనీస అవసరాల కోసం కలప అవసరం ఉంటే అడవిలోకి గొడ్డలి చేతపట్టుకుని వెళ్లాలంటేనే భయపడేవారు. ఒకవేళ అడవిలోకి వెళితే పట్టుకొని చేతిలోని గొడ్డళ్ళను సైతం స్వాధీనం చేసుకునేవారు. కట్టెల కోసం వెళ్లిన ఎడ్ల బండ్లను ఆఫీసుకు తరలించి కేసులు కూడా పెట్టేవారు. పెద్ద మొత్తంలో జరిమానాలు వేసేవారు. అటవీశాఖ నిబంధనలు అంత కఠినంగా ఉండేవి. ఈ దశలోనే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తర్వాత అడవుల సంరక్షణ, అభివృద్ధి కోసం నిబంధనలు మరింత జటిలంగా మారాయి. ఆటవీశాఖ యంత్రాంగం నిరంతరం అడవిని కంటికి రెప్పలా కాపాడుతుంది. ఏమైందో ఏమో కానీ ఇటీవల కొంతకాలంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా జూలూరుపాడు మండలం, జూలూరుపాడు అటవీశాఖ రేంజ్ పరిధిలోని అటవీ ప్రాంతాల్లో ఎన్నో ఏళ్ల నాటి చెట్లు నేలకొరుగుతున్నాయి. కలప దొంగలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మానవాళికి ప్రకృతి వరప్రసాదమైన పచ్చని చెట్లు రంపాల కారణంగా నేలకొరుగుతున్నాయి. గ్రామాల్లో కలప అక్రమ వ్యాపారానికి కొంతమంది ముఠాలుగా తయారయ్యారు. పచ్చని ప్రశాంతంగా ఉండే అటవీ ప్రాంతం నేడు రంపాల మోతతో మోగిపోతుంది. ఇప్పుడు ఏ చెట్టును కూడా దొంగలు వదలడం లేదు. కొద్దిరోజుల నుంచి గుండెపుడి బీట్ కాకర్ల అటవీ ప్రాంతంలో రంపాలు మోత మోగిస్తున్నాయి. తుమ్మ, చింత, నర్లేగి, నెమలి, వేవ, బ్రహ్మేడి, మామిడి వంటి మారుజాతి చెట్లను సైతం రంపాలతో ముక్కలు చేస్తున్నారు. చివరకు కలపను కూడా అక్కడే లారీల్లో లోడ్ చేస్తున్నారు. ఈ ఆక్రమ వ్యాపారాన్ని సక్రమంగా చేసుకునేందుకు కొత్త ఆలోచనకు తెర తీశారు. సుబాబుల్, జామాయిల్ కలపను రైతుల నుంచి కొనుగోలు చేస్తున్నారు. లారీల కింది భాగంలో ఖరీదైన కలపను ఉంచి, పైన జామాయిల్ కలపతో లోడు చేస్తున్నారు. ఇక్కడి నుంచి హైదరాబాద్ ప్రాంతానికి అక్రమంగా లారీల్లో కలపను తరలిస్తున్నారు. ఇంత జరుగుతున్నా అటవీశాఖ యంత్రాంగం చూసినా చూడనట్లుగా వ్యవహరిస్తోంది. పైగా మండల కేంద్రంలో అటవీ రేంజ్ కార్యాలయం కూడా ఉంది. రేంజర్ తో పాటు, సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లు కూడా ఈ ప్రాంతంలో నిత్యం తిరుగు తుంటారు. అప్పుడప్పుడు మొక్కుబడిగా జరిమానాలు విధించడం. కేసులు పెట్టడం చేస్తున్నారు. అంతేగాని కలప దందాను నియంత్రించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. అడవులను కంటికి రెప్పలా కాపాడాల్సిన ఆటవీ శాఖ అధికారులు కొందరు. అక్రమ సంపాదన కోసం అక్రమార్కులతో కుమ్మక్కయ్యారనే విమర్శలు చర్చనీయాంశంగా మారాయి. ఈ ప్రాంతంలో ఇష్టారాజ్యంగా జరుగుతున్న కలప మాఫియా, కలప ఆక్రమం నియంత్రణ కోసం అటవీశాఖ ఉన్నతాధికారులు సమగ్ర విచారణ జరిపి, తగు చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

## మహిళ ఆత్మహత్యకు కారణమైన వ్యక్తిపై కేసు నమోదు



**అశ్వాపురం .మహా:** మల్లెలమడుగు గ్రామానికి చెందిన దూదిమెట్ల సరిత వయసు 35 సంవత్సరాలు అనే మహిళ తన భర్తతో గొడవపడి కొన్ని సంవత్సరాలుగా భద్రాచలంలోని పెట్రోల్ బంక్ లో పని చేస్తూ నివసిస్తుంది. ఆమెతో పరిచయం పెంచుకున్న భద్రాచలం సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ప్రైవేటుగా అటెండర్ పనిచేసే పోతురాజు గురుమూర్తి వయసు 35 సంవత్సరాలు అనే వ్యక్తి ఆమె దగ్గర డబ్బులు తీసుకోవడమే కాకుండా ఆమెను మానసికంగా ఇబ్బంది పెడుతూ ఉండడంతో తేదీ 11 10 2025న మల్లెల మడుగు లోని తన ఇంటి వద్ద గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్ళగా భద్రాచలం ప్రభుత్వ ఆసుపత్రి అక్కడి నుంచి ప్రైవేటు ఆసుపత్రికి తరలించే చికిత్స చేయగా ఈరోజు ఉదయం మరణించినది ఇట్టి విషయంపై మృతురాలి సోదరుడు ఉడతల లింగమల్లు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేయడమైనది.

## అన్నదాతను హరిగోశ పెడుతున్న అధిక వర్షం





**జూలూరుపాడ, మహా:** ఈ ఏడాది ఋతుపవనాలు రాష్ట్రంలో సమయానుకూలంగా ప్రవేశించి అన్నదాతలకు అండగా నిలుస్తాయి అనుకుంటే, అధిక వర్షాలతో అన్నదాతను హరిగోశ పెడుతున్నాయి. కోటి ఆశలతోటి, ఆరుగాలం చాకిరి చేసి, లక్షల రూపాయలు పెట్టుబడి పెట్టి, కంటికి రెప్పల కాపాడిన పంటలన్నీ చేతికందే సమయంలో నేడు అధిక వర్షాలకు దెబ్బతిని తీవ్ర నష్టం వాటిల్లే పరిస్థితి నెలకొంది. ముఖ్యంగా తెల్ల బంగారంగా పిలవబడే పత్తి చేలు వర్షాలకు పూర్తిగా దెబ్బతిన్నాయి. భూమిలో తేమ శాతం పెరిగి మొక్కలు చనిపోవడం, వందల ఎకరాలు కలతప్పి ఎర్రబారాయి. తడిసిన తెల్ల బంగారం మొఖం కలతప్పి నల్ల బారింది. పత్తి పూల లో గింజలు మొలకెత్తుతున్నాయి. మరోవైపు కూరగాయల పంటలు పూత రాలి పూర్తిగా దిగుబడి తగ్గాయి. చీడ పీడల బెడద పెరిగి పంటలకు తెగుళ్ల వ్యాప్తి పెరిగింది. మిర్చి పంటకు వైరస్ వ్యాప్తి పెరగడంతోపాటు, విల్టు తెగులుతో మొక్కలు ఎండిపోతుండడంతో మిర్చి రైతుల మొఖాలు ఎర్రబడ్డాయి. వెరసి మండల వ్యాప్తంగా వందల ఎకరాలలో పత్తి, మిర్చి, కూరగాయలు, వరి పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. ఈ పరిస్థితులలో మండల రైతాంగం ప్రభుత్వ ఆర్థిక సహాయం కోసం దీనంగా ఎదురుచూస్తున్నారు.

## అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ (ఏఎస్సై)గా ఉద్యోగన్నతి

**ఖమ్మం, మహా:** పదోన్నతులు మరింత బాధ్యతను పెంచుతుందని పోలీస్ కమిష నర్ సునీల్ దత్ అన్నారు. వివిధ పోలీస్ స్టేషన్లలో హెడ్ కానిస్టేబుళ్లుగా బాధ్యతలు నిర్వహిస్తూ అసిస్టెంట్ సబ్ ఇన్స్పెక్టర్ (ఏఎస్సై)గా ఉద్యోగన్నతి పొంది ఖమ్మం కమిషనరేట్ కు కేటాయించబడిన పోలీస్ అధికారులు సోమవారం పోలీస్ కమిషనర్ కార్యాలయంలో పోలీస్ కమిషనర్ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సంద ర్భంగా వారిని పోలీస్ కమిషనర్ అభినందించారు.



FOLLOW: @ANNTELUGU
14-10-2025
WWW. EPAPER.MAHAADAILY.COM
భద్రాద్రి కొత్తగూడెం
మహా పత్రిక
ANN తెలుగు

# వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

## ఏడూళ్ళ బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు



**మణుగూరు/పినపాక, మహా:** పినపాక మండలంలో ఆదివారం రాత్రి నుంచి కురుస్తున్న భారీ వర్షాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఏడూళ్ళ బయ్యారం సీఐ వెంకటేశ్వరరావు సూచించారు. ప్రజలు వాగుల వద్దకు, ఒర్రెల వద్దకు, చెరువుల వద్ద చేపలు పట్టెందుందు వెళ్ళవద్దని సూచించారు. చిన్న పిల్లలను వాగుల వద్దకు వెళ్ళకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. లోతట్టు ప్రాం తాల ప్రజలు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఏమైనా సమస్యలు ఉంటే తక్షణమే పోలీసులకు సమాచారం అందించాలని తెలిపారు. రహదారులపై వరద ప్రవాహం ఎక్కువగా ఉన్నప్పుడు దాటే ప్రయత్నం చేయవద్దని హెచ్చరించారు.

**మణుగూరు విద్యుత్ వినియోగదారులకు ఏఇ విజ్ఞప్తి**

మణుగూరు మండలంలో ఆదివారం రాత్రి నుంచి ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా విద్యుత్ వినియోగదారులందరూ అప్రమత్తంగా ఉండాలని విద్యుత్ శాఖ ఏఇ ఉమారావు విజ్ఞప్తి చేశారు. సోమవారం ఈ మేరకు వాట్సాప్ మెసేజ్ ల ద్వారా హెచ్చరికలు, సూచనలు జారీ చేశారు. విద్యుత్ స్తంభాలను తాకరాదని, తడి చేతులతో విద్యుత్ పరికరాలను ముట్టుకోకూడదని సూచించారు. తెగిపడిన విద్యుత్ వైర్లను తాకరాదని, ఏదైనా ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ పోల్ లు, తీగలు ఉంటే వెంటనే 8712486075 సెల్ ఫోన్ నంబర్ కి సమాచారం ఇవ్వాలని కోరారు.

# అదుపు తప్పి పల్టీ కొట్టిన లారీ



**అశ్వారావుపేట, మహా:** అశ్వారావుపేట సమీపంలో సోమవారం రాయపూర్ నుంచి భీమవరం వెళ్తున్న CG-04-HY-7290 నంబర్ గల లారీ అదుపు తప్పి పల్టీ కొట్టింది. చేపల మేతతో వెళ్తుండగా ప్రమాదం సంభవించింది. ఈ ఘటనలో డ్రైవర్ స్వల్ప గాయాలతో బయటపడ్డాడు. పోలీసులు ఘటనకు సంబంధించి పూర్తి వివరాలు తెలుసుకోవడానికి దర్యాప్తు చేస్తున్నారు.

# స్థానిక ఎన్నికలకు సిద్ధంగా ఉండాలి



**టేకులపల్లి - మహా:** టేకులపల్లి మండలంలో ఉన్న భారతీయ జనతా పార్టీ సైనికులు, పార్టీ నాయకులు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తలు రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలకు సిద్ధంగా ఉండాలని టేకులపల్లి మండలంలో ఉన్న జడ్పిటిసి ,14 ఎంపీటీసీ , 36 సర్పంచ్ స్థానాలలో ప్రతి గ్రామపంచాయతీలో బిజెపి పార్టీ జెండా ఎగరాలని నరేంద్ర మోడీ సంక్షేమ పథకాల గురించి ప్రతి గ్రామ గ్రామంలో ప్రజలకు తెలియజేయాలని అదేవిధంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ఉచిత హామీలు, అమలు కాకపోవడం, కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను ప్రజలకు తెలియజేయాలని పార్టీ శ్రేణులకు టేకులపల్లి మండల జడ్పీటీసీ ఎన్నికల మండల కన్వీనర్ భూక్య రవి రాథోడ్ పిలుపునిచ్చారు.

# ముంచెత్తిన వాన

- మణుగూరులో మెరుపులు, పిడుగులతో విరుచుకుపడిన వర్షం..
- రహదారులను ముంచిన వరద నీరు..
- రాకపోకలకు తీవ్ర అంతరాయం..
- లోకట్టు ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : తాసిల్దార్ నరేష్





**మణుగూరు, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరు సబ్‌డివిజన్ లో ఆదివారం అర్ధరాత్రి నుంచి సోమవారం ఉదయం వరకు అల్లకల్లోలంగా మారింది. ఉరుములు, మెరుపులు, పిడుగుల శబ్దాలతో వాన విరుచుకుపడటంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. కొద్ది గంటల్లోనే వాగులు, వంకలు ఉధృతంగా పొంగిపొర్లాయి. మణుగూరు, అశ్వాపురం, దినపాక, కరకగూడెం మండలాల్లో భారీ వర్షపాతం నమోదై అనేక ప్రాంతాల్లో రహదారులు వరదనీటితో నిండిపోయాయి. కోడిపుంజుల వాగు, కట్టు వాగు, గొర్రెపేట వాగులు ఉధృతంగా ప్రవహిస్తూ రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగించాయి. రామానుజవరం-ఏటూరు నాగారం రహదారి మీద సురక్ష బస్టాండ్, రామానుజవరం ప్రాంతాల్లో వరదనీరు చేరడంతో వాహనాలు కదలలేని స్థితి ఏర్పడింది. కూనవరం రైల్వే గేట్ సమీపంలోని కోడిపుంజుల వాగు బ్రిడ్జిపై నుంచి నీరు పొంగి, సింగరేణి కార్మికులు, పివి కాలనీ నివాసులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. రామానుజవరం-పగడేరు రహదారి, రాజపేట ప్రాంతాలు, సురక్ష బస్టాండ్ పరిసరాలు చెరువుల్లా మారాయి. సమితి సింగారం పంచాయతీ పరిధిలోని వాగు మల్లారంలో డబుల్ బెడ్ రూమ్ ఇళ్లలోకి వరదనీరు చేరడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పాలయ్యారు. ఉరుము ఉరిమే మణుగూరు మీద పడిందా అన్న చందంగా వర్షం కురవడంతో మణుగూరు తో పాటు సబ్ డివిజన్ ప్రజలు భయాందోళనలకు గురయ్యారు.

## అప్రమత్తంగా ఉండాలి: నరేష్



మణుగూరు తాసిల్దార్ అద్దంకి నరేష్ ప్రజలను అప్రమత్తంగా ఉండాలని సూచించారు. సబ్‌డివిజన్ వ్యాప్తంగా వర్షాలు మరింత పెరిగే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. సుందరయ్య నగర్, వాగు మల్లారం, సమితి సింగారం తదితర ప్రాంతాల్లో నివసిస్తున్న ప్రజలు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు ఆదివారం రాత్రి సోషల్ మీడియాలో ప్రజలకు హెచ్చరికలు జారీ చేశారు. సోమవారం మణుగూరు ఎంపీడీవో టి శ్రీనివాసరావు, తాసిల్దార్ అద్దంకి నరేష్, రెవిన్యూ సిబ్బంది ముంపు ప్రాంతాల్లో పర్యటించారు. ఉధృతంగా ప్రవహిస్తున్న వాగులు వంకలను సందర్శించి ప్రజలకు పలు సూచనలు చేశారు.

## ముంపు ప్రాంతాల్లో పర్యటన

మణుగూరు మండలం, మున్సిపాలిటీ పరిధిలోని వర్ష బాధిత ప్రాంతాల్లో కాంగ్రెస్ పార్టీ నాయకులు సోమవారం పర్యటించారు.అశోక్ నగర్, కోడి పుంజుల వాగు పరిసరాలు, వాగు మల్లారం, సురక్ష బస్టాండ్ ప్రాంతాల్లో ముంపు పరిస్థితులను వారు పరిశీలించారు. మండల కాంగ్రెస్ అధ్యక్షుడు పీరీనాకి నవీన్ ఆధ్వర్యంలో గాండ్ల సురేష్, బొజ్జా త్రిమూర్తులు, ఎండి యాకూబ్ అలీ, మహిళా నేతలు కొలపిన్ని మానస, గద్దల ఆదిలక్ష్మి తదితరులు ఉన్నారు. నాయకులు బాధితులను పరామర్శించి, స్థానిక అధికారులతో మాట్లాడి తక్షణ చర్యలు తీసుకోవాలని కోరారు.



# పీఎం ఆవాస్ యోజన పనులు పరిశీలించిన బిజెపి నేతలు

**ఖమ్మం సిటీ, మహా:** ఖమ్మం నగరంలోని 57వ డివిజన్‌లో పీఎం ఆవాస్ యోజన పథకం కింద జరుగుతున్న ఇండ్ల నిర్మాణ పనులను టూ టౌన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి రుద్రగాని మాధవ్ గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన గఫూర్ నివాసం వద్ద నిర్మాణ పనులను ప్రత్యక్షంగా పరిశీలించి, లబ్ధిదారులతో మాట్లాడారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద కేంద్ర ప్రభుత్వం అందజేస్తున్న రూ.1,11,000 సహాయ నిధి వివరాలను వారికి తెలియజేశారు. కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రతి ఇంటికీ చేరేలా బీజేపీ కార్యకర్తలు కృషి చేయాలని మాధవ్ గౌడ్ పిలుపునిచ్చారు.

# వరి పంట పొలాలను పరిశీలించిన ఏవో మానస



**చింతకాని, మహా:** చింతకాని మండలంలోని గాంధీ ,నగర్ , పందిలపల్లి గ్రామాలలో బ్యాక్టీరియా, ఎండాకు తెగులు ఆశించిన వరి పొలాలను మండల వ్యవసాయ అధికారిణి సోములపల్లి మానస సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రస్తుతం వరిలో బ్యాక్టీరియా ఆకు ఎండు తెగులు ఆశిస్తున్నట్లు గమనించడం జరిగిందనీ, ఈ తెగులు ఆశించినప్పుడు ఆకుల పైన పసుపు రంగు మచ్చలు ఏర్పడి, అంచుల వెంబడి అలల మాదిరిగా ఎండిపోవడం జరుగుతుందనీ,ఈ తెగులు లక్షణాలు గమనించిన వెంటనే పైపాటుగా నత్రజని ఎరువును వేయడం తాత్కాలికంగా నిలిపివేయాలనీ సూచించారు.

# గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు

**కొత్తగూడెం టౌన్, మహా:** పోషకాహార మాస ఉత్సవాలలో భాగంగా సోమవారం న్యూ గొల్లగూడెం మేదర బస్తి అంగన్ వాడి స్కూల్ నందు జరిగిన కార్యక్రమంలో గర్భిణీ స్త్రీలకు శ్రీమంతాలు, ప్రీస్కూల్ పిల్లలకు అక్షరాభ్యాసాలు, అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఐ.సి.డి.ఎస్ సూపర్వైజర్ సరోజినీ, అంగన్వాడీ టీచర్స్ సత్యవతి, లక్ష్మీ, ప్రమీల, లత, ఆయాలు తల్లులు పాల్గొన్నారు.



# సిసిఐ కేంద్రాలను ఏర్పాటు చేసి రైతులను ఆదుకోవాలి

## అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య డిమాండ్

**ఖమ్మం సిటీ, మహా:** సిసిఐ కేంద్రాలను తక్షణమే ఏర్పాటు చేసి పత్తి రైతులను ఆదుకోవాలనీ అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఇల్లందు మాజీ ఎమ్మెల్యే గుమ్మడి నరసయ్య డిమాండ్ చేశారు. సోమవారం అఖిలభారత ఐక్య రైతు సంఘం ఖమ్మం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం మార్కెట్ ను సందర్శించి పత్తి రైతుల సమస్యలను పరిశీలించడం జరిగింది. మార్కెట్లో రైతుల ఇబ్బందులను పరిశీలించడం జరిగింది ఐక్య రైతు సంఘం ప్రతినిధి బృందంతో కలిసి మార్కెటింగ్ సందర్శించిన అనంతరం మార్కెట్ కార్యదర్శి , ఖమ్మం జిల్లా కలెక్టర్కు వినతి పత్రం ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా గుమ్మడి నరసయ్య మాట్లాడుతూ ప్రభుత్వం సిసిఐ అధికారులు అధికారులు చర్చల పేరుతోటి కాలయాపనం చేస్తూ అనేక వెయ్య ప్రయాసలుకోర్చి రైతాంగం పత్తిని పండిస్తే దానిని కొనుగోలు చేయడానికి నిర్లక్ష్యం వహిస్తున్నాయని అన్నారు ప్రభుత్వం రైతుల ఎడల ఈ నిర్లక్ష్య ధోరణి వదిలి జిన్నింగ్ మిల్ యజమాన్యాలు తక్షణమే రైతు పత్తిని కొనుగోలు చేయడానికి చర్యలు తీసుకోవాలని కోరినారు సీసీఐ నిబంధనలను పాటించని జిన్నింగ్ మిల్లులు పై చర్యలు తీసుకొని ప్రభుత్వమే మార్కెట్ యార్డుల్లో సీసీ ఐ కేంద్రాలను ఏర్పాటు చేసి కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో అఖిలభారత ఐక్య రైతు సంఘం రాష్ట్ర నాయకులు ఆవుల వెంకటేశ్వర్లు జిల్లా అధ్యక్ష కార్యదర్శులు మలీదు నాగేశ్వరరావు కోలేటి నాగేశ్వరరావు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కమ్మ కోమటి నాగేశ్వరరావు కేలోతు లక్ష్మణ్ పాశం అప్పారావు గుగులోత్ తేజ నాయక్ బీరెల్లి లాజర్ కుర్ర వెంకన్న తదితరులు పాల్గొన్నారు.



# వర్తించని జిఎస్టి

- జిఎస్టి తగ్గినా తగ్గని మందుల ధరలు
- పాత స్టాక్ పేరిట పాత రేట్లకే అమ్మకాలు
- పట్టికలు లేక ప్రజలు అయోమయం

**అశ్వారావుపేట, మహా:** కేంద్ర ప్రభుత్వం మందులపై జిఎస్టి రేట్లను తగ్గించి పేద, మధ్యతరగతి ప్రజలకు ఊరట కల్పించాలనే ఉద్దేశ్యంతో నిర్ణయం తీసుకున్నా, ఆ ప్రయోజనం అశ్వారావుపేట ప్రజలకు అందడం లేదు. మండల కేంద్రంలోని పలు మెడికల్ షాపులు ఇప్పటికీ పాత ధరలకే మందులు విక్రయిస్తున్నాయి. కొత్త జిఎస్టి రేట్లు అమలులోకి వచ్చాయంటూ వినియోగదారులు అడిగితే, ఇవి పాత స్టాక్ మందులు అని చెప్పి తప్పించుకుంటున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. దేశవ్యాప్తంగా పన్నులు తగ్గినా ఇక్కడ మాత్రం ఒక్క రూపాయి తగ్గలేదు అని వినియోగదారులు చెబుతున్నారు. ప్రభుత్వ నిర్ణయం ఎక్కడా కనిపించడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**పన్ను తగ్గించిన ప్రయోజనం లేదు..**

కేంద్ర ప్రభుత్వం ఇటీవల సాధారణ యాంటీబయోటిక్స్‌పై జిఎస్టి 12 శాతం నుంచి 5 శాతానికి తగ్గించగా, కొన్ని జీవరక్షక మందులపై పన్ను పూర్తిగా రద్దు చేసింది. దీంతో మందులు తక్కువ ధరలో అందాలని భావించిన ప్రజలు నిరాశ చెందుతున్నారు. స్థానిక వ్యాపారులు మాత్రం పాత ధరలకే విక్రయిస్తుండడంతో, ప్రభుత్వం చేసిన తగ్గింపు ప్రయోజనం వినియోగదారులకు అందడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నా.



### పట్టికలు లేవు - పారదర్శకత ఎక్కడ?

జిఎస్టి మారిన తర్వాత ప్రతి షాప్ తమ వద్ద పన్ను రేట్ల పట్టికను స్పష్టంగా ప్రదర్శించాల్సి ఉంటుంది. అయితే అశ్వారావుపేట కేంద్రంలోని చాలా మెడికల్ షాపుల్లో అలాంటి బోర్డులు కనిపించడం లేదు. పాత, కొత్త రేట్ల వివరాలు చూపించకపోవడం వినియోగదారులలో అనుమానాలను కలిగిస్తోంది.

### అధికారుల నిర్లక్ష్యం

పభుత్వం పన్ను తగ్గించింది కానీ షాపులు మాత్రం మన జేబులు ఖాళీ చేస్తున్నాయి. అధికారులు ఏమి చేస్తున్నారు? అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ, ఆరోగ్య, వాణిజ్య పన్ను శాఖలు ఈ అంశంపై గమనించకపోవడం ఆందోళన కలిగిస్తోంది. సామాజిక సంస్థలు ఈ అక్రమాలను వెంటనే అరికట్టి, తగ్గించిన ధరల్లోనే మందులు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నాయి.

# హాస్టల్ వర్కర్లు సమ్మెబాట విద్యార్థులు పని బాట

- చదువుకోవాలా.? లేదా....వంటలు వండుకోవాలా.?
- ప్రభుత్వ అధికారుల నిర్లక్ష్యం మూలాన్నే హాస్టల్ విద్యార్థులకు ఇక్కట్లు





**టేకులపల్లి - మహా:** హాస్టల్ వర్కర్లు తమ డిమాండ్ల సాధన కోసం సమ్మె బాట పట్టగా హాస్టల్ విద్యార్థులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు. తక్షణమే వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించి, విద్యార్థుల చదువు సాఫీగా సాగేలా చూడాలని డిమాండ్ చేస్తూ ఈరోజు ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పి.డి.ఎస్.యూ) ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని గిరిజన హాస్టల్ ముందు ప్రభుత్వ తీరును నిరసిస్తూ నిరసన వ్యక్తం చేస్తున్నారు. ఈ సందర్భంగా భద్రాద్రి కొత్తగూడెం పి.డి.ఎస్.యూ జిల్లా అధ్యక్షుడు వి విజయ్, జిల్లా సహాయ కార్యదర్శి ఏ అరుణ్ కుమార్ లు మాట్లాడుతూ... గిరిజన సంక్షేమ శాఖ అధికారుల నిర్లక్ష్యం మూలాన తమ న్యాయమైన డిమాండ్ల సాధనకై హాస్టల్ వర్కర్లు సమ్మెకు దిగటంతో హాస్టల్స్ లో వంట చేసుకునే బాధ్యత అనివార్యంగా విద్యార్థులపై పడింది. అటు హైస్కూల్, కళాశాలలో ఇటు హాస్టల్లో అనేక సమస్యల నడుమ విద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు వర్కర్ల సమ్మెతో ఆహార వడ్డింపు సమస్య కూడా ఎదుర్కొంటున్నారు. దసరా సెలవులు తర్వాత హాస్టల్ కి వచ్చిన విద్యార్థులు వంట చేసేవారు లేనివారు తిరిగి ఇంటి బాట పట్టే పరిస్థితి ఏర్పడుతుంది. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం విద్యార్థులు వంటజేసుకోవడం తీవ్ర ఇబ్బంది అవుతుంది. ఆలస్యంగా స్కూల్, కాలేజీకి వెళ్లడం మూసివేయక ముందే రావడం అవుతుంది. ఇది ఏమి పట్టని అధికారులు విద్యార్థులు వంట చేసుకుంటున్న చోద్యం చూస్తున్నట్టు చూస్తున్నారు. ఇదే సమయంలో వర్కర్ల సమస్యను పరిష్కారం చేయకుండా పనిలోకి రాకుంటే తొలగిస్తామని బెదిరింపులు చేస్తున్నారు ఇది వారి హక్కులను కాలరాయడమే . న్యాయమైన వర్కర్ల సమస్యలను పరిష్కరించకుండా వారిని బెదిరింపులకు గురి చేయడం దుర్మార్గమైన చర్య. తక్షణమే వారి సమస్యలను పరిష్కరించి, విద్యార్థుల చదువు సాఫీగా సాగేలా చూడాలని వారు డిమాండ్ చేశారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి

**ఖమ్మం,మహా:** ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి జిల్లా అధికారులను ఆదేశించారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్, అదనపు కలెక్టర్లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి ప్రజల నుండి అర్జీలను స్వీకరించారు.చింతకాని మండలం పాతర్లపాడు గ్రామానికి చెందిన కుటుంబరావు సర్వే నెంబర్ 26లో 10 గుంటలు, సర్వే నెంబర్ 28లో 12 గుంటల భూమి వారసత్వంగా తమకు వస్తున్నదని, తన పేరు రికార్డులలో చేర్చి పాస్ పుస్తకం జారీ చేయాలని కోరుతూ దరఖాస్తు చేసుకోగా, తహసిల్దార్ చింతకానికి రాస్తూ తగుచర్యలు తీసుకోవాలని కలెక్టర్ తెలిపారు.

## పంట కొనుగోళ్లు సజావుగా జరగాలి



**ఖమ్మం,మహా:** జిల్లాలో వానాకాలం సాగు జరిగిన ధాన్యం, పత్తి పంట కొనుగోళ్లు సజావుగా జరిగేలా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు.

జిల్లా కలెక్టర్, కలెక్టరేట్ సమావేశ మందిరంలో సోమవారం ధాన్యం , పత్తి కొనుగోళ్లపై అదనపు కలెక్టర్ లు డాక్టర్ పి. శ్రీజ, పి. శ్రీనివాస రెడ్డి లతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూ ప్రతిపాదిత ధాన్యం కొనుగోలు కేంద్రాలను క్షేత్ర స్థాయిలో పరిశీలించి, ఆ కొనుగోలు కేంద్రంలో మౌళిక వసతులు ఉన్నాయా, అప్రోచ్ రోడ్డు ఉందా వంటి అంశాలను పరిశీలించి రిపోర్టు అందించాలని కలెక్టర్ తెలిపారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని ఏర్పాట్లు చేయాలని, ఎటువంటి సమస్యలు రాకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియ జరగాలని అన్నారు. ఈ సమావేశంలో డి.ఎం. సివిల్ సప్లైస్ శ్రీలత, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీం, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## ఈవిఎం గోడౌన్‌ను తనిఖీ చేసిన కలెక్టర్



**ఖమ్మం,మహా:** నెలవారి తనిఖీల్లో భాగంగా కలెక్టరేట్ ఆవరణలో ఉన్న ఈ.వి.ఎం. గోడౌన్ ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి తో కలిసి సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఈవిఎం గోడౌన్ సీల్ ను ఈ.వి.ఎం., వి.వి. ప్యాట్లు ఉన్న గది సీల్ కలెక్టర్ పరిశీలించారు. ఫైర్ అలారం సరిచూసుకోవాలని, అగ్నిమాపక యంత్రాలు కండీషన్ పర్యవేక్షణ చేయాలని కలెక్టర్ అన్నారు. తనిఖీ రిజిస్టర్ లో జిల్లా కలెక్టర్ సంతకం చేశారు. సీసీ కెమెరాల పని తీరును ఎప్పటికప్పుడు పరిశీలిస్తూ, నిరంతరం అప్రమత్తంగా ఉండాలని సెక్యూరిటీ గార్డ్ ను ఆదేశించారు. జిల్లా కలెక్టర్ వెంట ఎన్నికల విభాగం పర్యవేక్షకులు ఎం.ఏ. రాజు, కలెక్టరేట్ ఎన్నికల డిటి అన్సారీ, అధికారులు, తదితరులు ఉన్నారు.

## కేంద్రీయ విద్యాలయ పనులు సకాలంలో పూర్తి చేయాలి



**భద్రాద్రి బ్యూరో, మహా:** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాకు మంజూరైన కేంద్రీయ విద్యాలయానికి సంబంధించి తాత్కాలిక తరగతి గదులకై కేటాయించబడిన భవనానికి వెంటనే మరమ్మతులు చేపట్టాలని జిల్లా కలెక్టర్ జితేష్ పాటిల్ అధికారులను ఆదేశించారు. సోమవారం పాత కొత్తగూడెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆనంద ఖనిలో గల భవన సముదాయాన్ని కలెక్టర్ పరిశీలించి కేంద్రీయ విద్యాలయ సంఘటన్ వారు సూచించిన సూచనలకు అనుగుణంగా మార్పులు చేయుటకు ప్రతిపాదనలు రూపొందించి అందజేయాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. ఈ పనులు త్వరితగతిన పూర్తయి వచ్చే విద్యా సంవత్సరం ప్రారంభం కల్లా కేంద్రీయ విద్యాలయం తరగతులు ప్రారంభించేటట్లుగా చర్యలు తీసుకోవాలని జిల్లా విద్యాశాఖ అధికారులను సూచించారు. అనంతరం పక్కనే గల పట్టణ గురుకుల బాలుర పాఠశాలను సందర్శించి అక్కడ విద్యార్థులతో మాట్లాడి పిల్లలకు ఏమైనా అవసరాలు ఉంటే తనకు తెలియజేయాలని స్పెషల్ ఆఫీసర్ ను ఆదేశించారు. ఈ పర్యటనలో జిల్లా విద్యాశాఖ అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఏ.నాగరాజశేఖర్, విద్యాశాఖ ఇంజనీరింగ్ విభాగ అధికారి రాజగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు పలు గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేత



**కూసుమంచి, మహా:** కూసుమంచి మండలంలోని నర్సింహులగూడెం 11KV విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో గల చౌటపల్లి ఫీడర్ పరిధిలోని పలు గ్రామాలకు మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ తావుర్యా సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మెయింటినెన్స్ లో భాగంగా, చెట్లు నరికేందుకు గాను సబ్ స్టేషన్ పరిధిలోని బోడియతండా, చౌటపల్లి గ్రామాలకు గృహ, వ్యవసాయ కనెక్షన్లకు ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ తెలిపారు. వినియోగదారులు, ప్రజలు అందరూ సహకరించాలని కోరారు.

# అగ్నిప్రమాదంలో పూరిల్లు దగ్ధం

## పరామర్శించిన ఎమ్మెల్యే కనకయ్య





**టేకులపల్లి - మహా:** టేకులపల్లి మండలం మేళ్ల మడుగు గ్రామంలో అగ్ని ప్రమాదంలో ఓ పూరిల్లు షార్ట్ సర్క్యూట్ కావడంతో నిప్పంటుకొని వట్టం నాగేశ్వరావు జానకి దంపతుల ఇల్లు కాలిపోయింది ఇద్దరి కుమార్తెల డిగ్రీ సర్టిఫికెట్లు 50000 నగదు నిత్యవసర సామాగ్రి పూర్తిగా కాలిపోయినయని కన్నీరు మున్నీరయ్యారు విషయం తెలుసుకున్న ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య బాధిత కుటుంబాన్ని పరామర్శించారు కుటుంబానికి ఆర్థిక సహాయం అందించి ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేస్తామని హామీ ఇచ్చారు మీ కుటుంబానికి అండగా ఉండాలని అధికారులకు ఆదేశించారు ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు కోరం సురేందర్ పిఏసిఎస్ చైర్మన్ లక్కినేని సురేందర్ ఎస్సై ఆలకుంట రాజేందర్ సిఐ బత్తుల సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు

# అభివృద్ధి లక్ష్యంగా ముందుకు

- మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి
- మరుగుదొడ్లు, బస్ షెల్టర్ల నిర్మాణాలకు రూ.20 లక్షలు మంజూరు
- సుజాతనగర్ కేంద్రంలో చేపట్టనున్న నిర్మాణాలు
- త్వరితగతిన పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తాం
- ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు



**భద్రాద్రి బ్యూరో, మహా:** కొత్తగూడెం నియోజకవర్గంలో ప్రజలకు కావాల్సిన కనీస మౌలికవసతుల కల్పనపై కొత్తగూడెం శాసనసభ సభ్యులు కూనంనేని సాంబశివరావు ప్రత్యేక దృష్టి సారించారు. వివిధ పథకాల్లో మంజూరైన నిధులతో నియోజకవర్గంలో అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతుండగా అనేక అభివృది ్ధపనులు పూర్తయి ప్రజలకు అందుబాటులోకి వచ్చాయి. తాజాగా సుజాతనగర్ మండల కేంద్రంలో మరుగుదొడ్లు, బస్ షెల్టర్, వేపలగడ్డలో మరో బస్ షెల్టర్ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయి. ఈ సందర్భంగా కూనంనేని మాట్లాడుతూ సుజాతనగర్ మండల కేంద్రంలో ప్రజల సౌకర్యార్థం మరుగుదొడ్ల నిర్మాణానికి రూ. 10లక్షలు, సుజాతనగర్ మండల కేంద్రం, వేపలగడ్డ గ్రామ సెంటర్లో బస్ షెల్టర్ల నిర్మాణానికి రూ. 10 లక్షలు మంజూరయ్యాయని తెలిపారు. ఎమ్మెల్యే నిధులతో చేపట్టనున్న ఈ అభివృద్ధి పనులను ప్రారంభించి త్వరితగతిన పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు. అభివృద్ధి పనులు, ప్రజలకు కావాల్సిన మౌలిక వసతుల కల్పనలో ఎలాంటి వివక్ష ఉండబోదని, నియోజకవర్గంలో ప్రజలకు కావాల్సిన అవసరాలు గుర్తించి ఇప్పటికే ప్రతిపాదనలు సిద్ధం చేసి సంబంధిత శాఖలకు అందించామని తెలిపారు. ప్రాధాన్యతా క్రమంలో అభివృద్ధి పనులు పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తెస్తామని తెలిపారు.

# ఖమ్మం నగరాన్ని ఆదర్శంగా తీర్చిదిద్దాలి

## జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి





**ఖమ్మం,మహా:** నగరాన్ని మెరుగైన పారిశుద్ధ్య సేవలతో ఆదర్శ నగరంగా తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. సోమవారం తెల్లవారుజామున జిల్లా కలెక్టర్, మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ అభిషేక్ అగస్త్యతో కలిసి నగరంలో పర్యటించి, ప్రధాన రహదారులు, పార్కులు, మయూరి సెంటర్, వైరారోడ్, ప్రభుత్వ హాస్పిటల్, ఇల్లందు క్రాస్ రోడ్ సెంటర్ లలో పరిశుద్ధ్య పనులను తనిఖీ చేశారు. చెత్త సేకరించే కార్మికులు, జవాలతో కలెక్డర్ ముచ్చటించారు. సైడ్ డ్రెయిన్లు శుభ్రపర్చాలని, రోడ్డు లో పేరుకపోయిన మట్టి ఎత్తివేయాలని, డివైడర్స్ లోని మొక్కలను కాపాడాలని, పారిశుద్ధ్యం పనులు ముమ్మరంగా చేయాలని సూచించారు. పర్యటనలో బైపాస్ రోడ్, ఎన్టీఆర్ సర్కిల్, శ్రీశ్రీ రోడ్ లలో మరమత్మలు చేసిన గుంతల నాణ్యతను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి మాట్లాడుతూన ఖమ్మంలో పది రోజులపాటు ప్రత్యేక ప్రణాళికతో పారిశుద్ధ్య డ్రైవ్ ను చేపట్టామన్నారు. నగరంలో మరింత మెరుగ్గా పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు చేపట్టామన్నారు. చెత్తను శుభ్రం చేసి, మురుగునీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రత్యేక డ్రైవ్ రోజువారీ పారిశుధ్య పనులకు దోహదంగా ఉంటుందని అన్నారు. చెత్త తో ఉన్న ప్రాంతాలను శుభ్రం చేసిన తర్వాత ముందు, ఆ తరువాత తేడాను తెలియజేసేలా ఫోటోలు తీయాలని మున్సిపల్ సిబ్బందిని ఆదేశించారు. నగరంలోని ప్రధాన రోడ్లు, అంతర్గత రోడ్లలో ఎక్కడ చెత్త ఉండకుండా శుభ్రం చేయాలని, వర్షాల వల్ల పేరుకుపోయిన మట్టి తొలగించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ కమీషనర్ అనిల్ కుమార్, ఇఇ కృష్ణలాల్, గ్రీనరీ అధికారిణి రాధిక, శానిటేషన్ ఇన్స్పెక్టర్లు, సూపర్వైజర్, జవాన్ లు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు. .

# గురుకులంలో ఘోరం

## మైనర్ విద్యార్థిపై జువాలజీ టీచర్ లైంగిక వేధింపులు!

- జువాలజీ టీచర్‌పై లైంగిక వేధింపుల కేసు!
- ఆత్మహత్య చేసుకున్న ఉపాధ్యాయుడు!
- మైనారిటీ బాయ్స్ స్కూల్‌లో భద్రతపై ప్రశ్నలు



**ఖమ్మం, మహా:** ఖమ్మం జిల్లా, కొణిజర్ల మండలం, అమ్మపాలెం గ్రామంలోని మైనారిటీ బాయ్స్ రెసిడెన్షియల్ స్కూల్‌లో చోటుచేసుకున్న దారుణ ఘటన రాష్ట్ర విద్యా వ్యవస్థలో భద్రతపై తీవ్రమైన ఆందోళనను రేకెత్తించింది. పాఠాలు చెప్పాల్సిన ఓ జువాలజీ ఉపాధ్యాయుడు, మైనర్ విద్యార్థిపై తరచూ లైంగిక వేధింపులకు పాల్పడినట్లుగా ఫిర్యాదు నమోదైంది. ఈ విషయం వెలుగులోకి రాగానే నిందితుడైన ఉపాధ్యాయుడు ఆత్మహత్యా యత్నానికి పాల్పడి, ఆసుపత్రిలో చికిత్స పొందుతూ మరణించాడు. కొణిజర్ల మండలం, అమ్మపాలెంలోని మైనారిటీ బాయ్స్ రెసిడెన్షియల్ పాఠశాలలో పనిచేస్తున్న జువాలజీ టీచర్, ఓ మైనర్ విద్యార్థిని బెదిరించి లైంగికంగా వేధించేవాడు. ఇటీవల దసరా సెలవులకు ఇంటికి వెళ్లిన విద్యార్థి, తీవ్ర భయాందోళనతో తిరిగి స్కూల్‌కి వెళ్లడానికి నిరాకరించడంతో ఈ దారుణం వెలుగులోకి వచ్చింది. తల్లిదండ్రులు తమ కుమారుడిని ఆరా తీయగా, ఉపాధ్యాయుడి వేధింపుల గురించి విద్యార్థి కన్నీటి పర్యంతమయ్యాడు. ఈ విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు వెంటనే పాఠశాల ప్రిన్సిపాల్ సమక్షంలో కొణిజర్ల పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు అందిన తక్షణమే పోలీసులు ఉపాధ్యాయుడిపై పోక్సో చట్టం కింద కేసు నమోదు చేశారు. ఈ ఘటన తీవ్రత దృష్ట్యా, నిందితుడిని సర్వీస్ నుండి తక్షణమే తొలగించారు.

### ఉపాధ్యాయుడి మృతి...

పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన విషయం తెలియగానే, నిందితుడైన ఉపాధ్యాయుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. వెంటనే పోలీసులు అతడిని అదుపులోకి తీసుకుని చికిత్స కోసం ఆసుపత్రికి తరలించారు. అయితే, చికిత్స పొందుతూ నిందితుడు సోమవారం సాయంత్రం మృతి చెందాడు.

### భద్రతపై ప్రశ్నలు...

ప్రస్తుతం, పోలీసులు ఈ కేసును లోతుగా దర్యాప్తు చేస్తున్నారు. పాఠశాల సిబ్బంది, పోలీసులు కలిసి మైనర్ విద్యార్థికి కౌన్సిలింగ్ ఇప్పిస్తూ, అతని రక్షణకు అన్ని జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ ఘటన రాష్ట్రంలోని రెసిడెన్షియల్ పాఠశాలల్లో విద్యార్థుల భద్రతను పటిష్టం చేయాల్సిన ఆవశ్యకతను మరోసారి స్పష్టం చేసింది. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా ఉండాలంటే, ఉపాధ్యాయుల నియామకంలో కఠినమైన చర్యలు, అలాగే విద్యార్థులకు భయం లేకుండా ఫిర్యాదు చేసేందుకు సురక్షితమైన వాతావరణాన్నికల్పించాలని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు.

# 2కోట్ల 50లక్షల గంజాయి పట్టివేత



**భద్రాద్రి బ్యూరో, మహా:** సులువుగా డబ్బు సంపాదించి కోట్లకు పడగెత్తాలనే లక్ష్యంతో కొందరు సిండికేట్గా మారి మాఫియా పనులకు శ్రీకారం చుడుతున్న విషయం అందరికి తెలిసిందే. ఇదే కోవాకు చెందిన ఒక ముఠా సాహసించి నిషేధిత గంజాయి రవాణా చేస్తూ అడ్డంగా దొరికిన సంఘటన జిల్లా కేంద్రంలో జరిగింది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా సుజాతనగర్ మండలంలో భారీ గంజాయి పోలీసులకు పట్టుబడింది. మహారాష్ట్ర, కర్ణాటక చెందిన ఇద్దరు వ్యక్తులు లారీ కంటైనర్లో ప్రభుత్వ నిషేదిత గంజాయిని భద్రాచలం నుండి కొత్తగూడెం ఖమ్మం మీదుగా రాజస్థాన్లోని జైపూర్ కి అక్రమ రవాణా చేస్తున్నారని పోలీసులకు సమాచారం అందింది. నమ్మదగిన సమాచారం మేరకు సోమవారం సిసిఎస్ పోలీసులు, సుజాతనగర్ ఎస్సై రమాదేవి తన సిబ్బందితో కలిసి సంయుక్తంగా సుజాతనగర్ మండలం వేపలగడ్డ గ్రామంలో ఉన్న అన్నపూర్ణ బేకరీ వద్ద వాహన తనిఖీలు చేపట్టగా అశోక్ లేలాండ్ లారీ కంటైనర్ కొత్తగూడెం నుండి ఖమ్మం వైపుగా వస్తుండగా అనుమానం వచ్చి పోలీసులు ఆపారు. కంటైనర్ ను తనిఖీ చేయగా అందులో 96 ప్రభుత్వ నిషేదిత గంజాయి ప్యాకెట్లను గుర్తించడం జరిగింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ రోహిత్ రాజు మాట్లాడుతూ కంటైనర్ లో 96 గంజాయి ప్యాకెట్లను స్వాధీనం చేసుకోగా 499 కేజీలు గంజాయి ఉన్నట్లుగా తేలిందన్నారు. దీని విలువ సుమారుగా రూ.2,50,00,000 ఉంటుందని పేర్కొన్నారు. ప్రభుత్వ నిషేదిత గంజాయిని స్వాదీనం చేసుకోవడంతోపాటు గంజాయిని అక్రమ రవాణా చేస్తున్న జగదీశ్ దయారాం పాటిల్, సంజు కుమార్‌ను అదుపులోకి తీసుకోవడం జరిగిందని వీరిద్దరిపై కేసు నమోదు చేసినట్లుగా పేర్కొన్నారు. మరో ఇద్దరు అమిత్ రోహిదాస్ పాటిల్, హరి పరారీలో ఉన్నట్లుగా తెలిపారు. పట్టుబడిన వ్యక్తులకు చాలా కాలం నుండి గంజాయి బిజినెస్ చేస్తున్నట్లుగా చెప్పారు. అశోక్ లేలాండ్ కంటైనర్ లారీ, రెండు సెల్ఫోన్లను స్వాదీనం చేసుకోవడం జరిగిందన్నారు. ఇట్టి గంజాయిని నేరస్తులను పట్టుకోవడంలో సహకరించిన సిసిఎస్ సీఐ రమాకాంత్ ని, ఎస్సైలు ప్రవీణ్, రామారావు వారి సిబ్బందిని, సుజాతనగర్ ఎస్సై రమాదేవిని వారి సిబ్బందిని ఈ కేసు విచారణాధికారి సిఐ వెంకటేశ్వర్లుని, వారి సిబ్బందిని కేసు పర్యవేక్షణ అధికారి డి.ఎస్.పిని ప్రత్యేకంగా అభినందిస్తున్నట్లుగా ఎస్పీ పేర్కొన్నారు.

# కూలీలు ఒడ్డుకు చేరుతున్న దృశ్యం



**ముదిగొండ, మహా:** ప్రశాంతంగా ఉన్న మున్నేరు ఉన్నట్టుండి సోమవారంలో ఆకస్మికంగా వరద ఉధృత పెరగటంతో మండలంలోని పెద్దమండవ మున్నేరులో ట్రాక్టర్లకు ఇసుక లోడ్ చేస్తున్న కూలీలు వరద ఉధృతను గమనించి అప్రమత్తంగా కూలీలు,డ్రైవర్లు క్షేమంగా రోడ్డుకు చేరారు.దీంతో గ్రామస్తులు,కూలీల ఊపిరి పీల్చుకున్నారు.మూడు ఇసుక ట్రాక్టర్లు మున్నేరులో చిక్కుకొని మునిగాయి.

మహా పత్రిక
ANN తెలుగు

# బిజెపిలోకి ఖమ్మం డాక్టర్ మారుతి గౌడ్




**ఖమ్మం, మహా:** భారతీయ జనతా పార్టీ (బిజెపి) తెలంగాణ రాష్ట్రంలో తన బలాన్ని మరింత పెంచుకునే దిశగా అడుగులు వేస్తోంది. దీనిలో భాగంగా బిజెపి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లాకు చెందిన ప్రముఖ డాక్టర్, న్యూరో సర్జన్ అయిన డాక్టర్ కె. మారుతి గౌడ్ సోమవారం అధికారికంగా బిజెపి పార్టీలో చేరారు. హైదరాబాద్ నాంపల్లిలోని రాష్ట్ర బిజెపి కార్యాలయం నందు జరిగిన ఈ ముఖ్య కార్యక్రమంలో, బిజెపి రాష్ట్ర అధ్యక్షులు ఎన్. రామచంద్ర రావు మారుతి గౌడ్‌కు పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. వీరితోపాటు మరో 50 మందిని కూడా పార్టీలోకి ఆహ్వానించి బిజెపి కండువా కప్పారు. ఖమ్మం నుంచి వచ్చిన డాక్టర్ మారుతి గౌడ్ చేరిక పార్టీకి, ముఖ్యంగా ఖమ్మం జిల్లాలో, మరింత బలాన్ని చేకూరుస్తుందని రాష్ట్ర అధ్యక్షులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. వైద్యరంగంలో ఆయనకున్న అనుభవం, ప్రజాసంబంధాలు పార్టీ బలోపేతానికి దోహదపడతాయన్నారు. అనంతరం మారుతి గౌడ్ మాట్లాడుతూ, బిజెపి సిద్ధాంతాలు, ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వం నచ్చడం వల్లే తాను పార్టీలో చేరినట్లు తెలిపారు. తన వృత్తిపరమైన అనుభవంతోపాటు, ప్రజలకు సేవ చేసేందుకు రాజకీయాలను వేదికగా చేసుకుంటానని, పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని హామీ ఇచ్చారు ఈ కార్యక్రమంలో బిజెపి రాష్ట్ర కోశాధికారి వాసుదేవరావు, సన్నీ ఉదయ్ ప్రతాప్, నంబూరి రామలింగేశ్వరరావు, మండడపు సుబ్బారావు,ఆకుల నాగేశ్వరావు, బోయినపల్లి సురేష్,కొండా గోపి, రుద్రగాని మాధవ్,గోపి తదితరులు పాల్గొన్నారు.

## ఓట్ల చోరీ చేసినది కాంగ్రెస్ కదా?



**ఖమ్మం సిటీ, మహా:** తెలంగాణలో ప్రజలను మభ్యపెట్టి, మాయ చేసి ఓట్లు దొంగిలించింది కాంగ్రెస్ పార్టీ అని బీజేపీ రాష్ట్ర నాయకుడు డా. శీలం పాపారావు తీవ్రంగా విమర్శించారు. ప్రతి వర్గాన్నీ ఆకట్టుకునే తప్పుడు హామీలతో కాంగ్రెస్ ఎన్నికల సమయంలో ప్రజల్ని మోసం చేసిందని ఆయన మండిపడ్డారు. మహిళలకు నెలకు ?2,500, వృద్ధులకు ?4,000, వికలాంగులకు ?6,000 పెన్షన్, రైతులకు ఎకరాకు ?15,000 రైతుబంధు, రెండు లక్షల రూపాయల రుణమాఫీ, కల్యాణలక్ష్మి కింద ?1.25 లక్షల పథకాలు, పెళ్లి కానుకగా తులం బంగారం, గ్యాస్ సిలిండర్‌ను ?500కి ఇవ్వడం, ప్రతి ఇంటికి 200 యూనిట్ల ఉచిత కరెంటు వంటి హామీలన్నీ ఎన్నికలకే పరిమితమయ్యాయని ఆయన అన్నారు.

## సీసీఐ కేంద్రాలు వెంటనే ఏర్పాటు చేయాలి



**వైరా,మహా:** వ్యవసాయ మార్కెట్లతో పాటు అన్ని మండల కేంద్రాల్లో పత్తి కొనుగోలు కేంద్రాలు సీసీఐ ని వెంటనే ఏర్పాటు చేయాలని సిపి(ఐ)ఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు, అకాల వర్షంతో ఒకవైపున రైతు తీవ్రంగా నష్టపోయి చేతికి వచ్చిన పత్తి పంట అమ్ముకోవడానికి సరైన ధర లేక ప్రైవేట్ వ్యాపారులకు తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి దాపురించిందని వెంటనే ప్రభుత్వం సంబంధించిన అధికారుల స్పందించి పత్తి కొనుగోలు కేంద్రం సిసిఐ ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు, కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేస్తామని మాటలకే పరిమితమై కాలయాపన చేయడంతో రైతులకు తీవ్ర నష్టం జరుగుతుందని గుర్తు చేశారు, ప్రభుత్వాలు సకాలం స్పందించకపోతే రైతులతో పాటు అన్ని రైతు సంఘాలతో కలిపి తీవ్ర ఆందోళన పోరాటాలకు సిద్ధం కావాల్సి ఉంటుందని ఆయన వైరాలో మీడియాతో మాట్లాడుతూ తెలిపారు.

## మధిరలో ఘనంగా టిడిపి సన్నాహక సమావేశం

**మధిర, మహా:** మధిర నియోజకవర్గ టిడిపి కార్యాలయంలో సన్నాహక సమావేశం సోమవారం ఘనంగా జరిగింది. పట్టణ టిడిపి అధ్యక్షుడు మల్లాది హనుమంతరావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశానికి రాష్ట్ర స్థాయి నేతలు హాజరయ్యారు. ఈ కార్యక్రమానికి ప్రధాన అతిథులుగా పార్టీ పొలిట్ బ్యూరో సభ్యుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి బక్కిని నరసింహులు, తిరుమల తిరుపతి దేవస్థానం కమిటీ సభ్యుడు నన్నూరి నర్సిరెడ్డి, రాష్ట్ర ఉపాధ్యక్షుడు, ఖమ్మం పార్లమెంట్ కన్వీనర్ డాక్టర్ వాసిరెడ్డి రామనాథం హాజరయ్యారు. సభలో మాట్లాడుతూ నేతలు టిడిపి కార్యకర్తల కృషి, అంకితభావం వల్లే తెలంగాణలో 1.88 లక్షల సభ్యత్వాలు నమోదు చేయగలిగామని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో ఆర్థికంగా కష్టాల్లో ఉన్న రాష్ట్రాన్ని సీఎం చంద్రబాబు గారు తిరిగి గాడిన పెట్టారని, త్వరలోనే తెలంగాణ పునర్నిర్మాణంపై కూడా ఆయన దృష్టి పెడతారని పేర్కొన్నారు. ఖమ్మం జిల్లా నుంచే టిడిపి అధికార ప్రస్థానం మళ్లీ ప్రారంభమవాలని పిలుపునిచ్చారు.

# ఓటు చోరీ.. గద్దె చోడ్

## రాహుల్ పిలుపుతో ఖమ్మం వీధుల్లో ప్రదర్శన

### మోడీ ఓటు చోరీతోనే అధికారంలోకి తుమ్మల






**ఖమ్మం, మహా:** రాహుల్ గాంధీ పిలుపుతో దేశవ్యాప్తంగా అలజడి సృష్టిస్తున్న 'ఓటు చోరీ వ్యతిరేక సంతకాల ఉద్యమం' ఖమ్మంలో ప్రజా శక్తిగా మారింది. సోమవారం నగరంలో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఓటు చోరీ %-% గద్దె చోడ్' ర్యాలీ ఉత్సాహంగా సాగింది. తుమ్మల క్యాంపు కార్యాలయం నుంచి ప్రారంభమైన ఈ ర్యాలీ, జడ్పీ సెంటర్ వరకు భారీ జనసందోహంతో ముందుకు కదిలింది. యువత, మహిళలు, కాంగ్రెస్ కార్యకర్తలు రాహుల్ గాంధీ పిలుపుకు స్పందిస్తూ నినాదాలతో నగరాన్ని మార్మోగించారు.

**మోడీ ఓటు చోరీతోనే అధికారంలోకి - తుమ్మల విమర్శ**

ర్యాలీ ముగిసిన అనంతరం జరిగిన సభలో మాట్లాడుతూ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు బీజేపీ ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. "ప్రతి పౌరుడు తన ఓటు హక్కును వినియోగించేలా చూడాల్సింది కేంద్ర ప్రభుత్వ బాధ్యత. కానీ మోడీ సర్కార్ ఎన్నికల వ్యవస్థను వక్రీకరిస్తూ ప్రజాస్వామ్యాన్ని దెబ్బతీస్తోంది. మోడీ ఓటు చోరీతోనే మూడోసారి అధికారంలోకి వచ్చాడు," అని ఆయన మండిపడ్డారు. దేశవ్యాప్తంగా జరుగుతున్న ఓటు హక్కు దోపిడీకి వ్యతిరేకంగా కాంగ్రెస్ పార్టీ విస్తృత స్థాయి ప్రజా ఉద్యమాన్ని ప్రారంభించింది. ఈ ఉద్యమం రాహుల్ గాంధీ పిలుపుతో ప్రతి జిల్లాలో ఉత్సాహంగా సాగుతోంది. ప్రజాస్వామ్యం కాపాడేందుకు ప్రతి కార్యకర్త ముందుండాలి," అని ఆయన పిలుపునిచ్చారు.బీజేపీ నేతలు రాజ్యాంగాన్ని తమ చేతుల్లో పెట్టుకొని ప్రజల ఓట్లను తమ అనుకూలంగా మలచుకుంటున్నారు. రాజ్యాంగ పరిరక్షణ కోసం యువత ముందుకు రావాలి. ఇది ఒక రాజకీయ యుద్ధం కాదు, ప్రజాస్వామ్య రక్షణ సమరం," అని అన్నారు. ఈ కార్యక్రమంలో మేయర్ నీరజ, డిప్యూటీ మేయర్ జోహారా ఫాతిమా, మార్కెట్ కమిటీ చైర్మన్ హనుమంతరావు, కార్పొరేటర్ కమర్తపు మురళీ, ఇతర కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు.

# సైబర్ మోసగాడి అరెస్ట్

**ఖమ్మం, మహా:** లిఆన్‌లైన్ మోసాలపై ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులు మరోసారి తమ దూకుడును చాటారు. పార్ట్‌టైమ్ ఉద్యోగం మరియు ఇన్వెస్ట్మెంట్ పేరుతో ప్రజలను మోసం చేసే గ్యాంగ్‌పై గట్టి దెబ్బ కొట్టారు. ఖమ్మం జిల్లాలోని వెంసూర్ మండలం ప్రాంతానికి చెందిన ఒక ప్రైవేట్ ఉద్యోగి నుండి సుమారు ?30 లక్షల రూపాయలు కాజేసిన కేసులో ప్రధాన నిందితుడిని మహారాష్ట్రలో అరెస్టు చేసినట్లు ఖమ్మం పోలీస్ కమిషనర్ సునీల్ దత్ వెల్లడించారు. వెంసూర్ మండలానికి చెందిన బాధితుడు టెలిగ్రామ్ యాప్ ద్వారా ఒక వ్యక్తితో పరిచయం ఏర్పరుచుకున్నాడు. 'ఆన్‌లైన్ పార్ట్‌టైమ్ జాబ్ చేయండి, ఇన్వెస్ట్ చేస్తే అధిక లాభాలు వస్తాయి' అంటూ నమ్మకమొచ్చే రీతిలో చాట్‌లు, వాట్సాప్ గ్రూపులు, ఆన్‌లైన్ వెబ్‌సైట్లు ఉపయోగించి దారితప్పించారు. కొద్ది రోజుల వ్యవధిలో క్రమంగా పెట్టుబడులు పెంచుతూ మొత్తం ?30 లక్షల వరకు డబ్బులు ట్రాన్స్‌ఫర్ చేయించాడు. చివరికి డబ్బు తిరిగి రాకపోవడంతో బాధితుడు ఖమ్మం సైబర్ క్రైమ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు అందుకున్న వెంటనే సైబర్ క్రైమ్ డీఎస్పీ చె.ఆర్.వి. ఫణీందర్ ఆధ్వర్యంలో బృందం ఏర్పడి, ఫోన్ నంబర్లు, బ్యాంక్ ఖాతాలు, యూపీఐ లావాదేవీలను సాంకేతిక పద్ధతుల్లో విశ్లేషించింది. దర్యాప్తులో ఒక ముఖ్యమైన ఖాతాకు ?5 లక్షలు జమ అయినట్లు గుర్తించారు. ఆ ఖాతా హోల్డర్ మహారాష్ట్రలోని ఔరంగాబాద్ జిల్లా – ఛత్రపతి శంబాజీ నగర్, కేశర్సింగ్‌పూర్, కోకాన్వాడీ ప్రాంతానికి చెందిన రవీంద్ర లక్ష్మణ్ రావు జారస్ గా గుర్తించారు. ఈ ఆధారాల ఆధారంగా సైబర్ పోలీసుల బృందం మహారాష్ట్రకు వెళ్లి అక్కడి స్థానిక పోలీసుల సహకారంతో రవీంద్రను అరెస్టు చేశారు. అనంతరం అతన్ని ఖమ్మానికి తరలించి సైబర్ క్రైమ్ కోర్టులో హాజరుపరిచి, రిమాండ్‌కు పంపించారు.

**పోలీసు బృందానికి సీపీ అభినందనలు**

ఈ విజయవంతమైన ఆపరేషన్‌లో పాల్గొన్న సిబ్బందిని సీపీ సునీల్ దత్ ప్రత్యేకంగా అభినందించారు. కేసు విచారణలో ప్రధాన పాత్ర పోషించిన డీఎస్పీ చె.ఆర్.వి. ఫణీందర్, ఇన్‌స్పెక్టర్లు ఎస్.కె. యాసీన్, కె. నరేష్, ఎస్.ఐలు కృష్ణ, విజయకుమార్, కానిస్టేబుళ్లు రాజేందర్, సంతోష్ తదితర సిబ్బంది కృషిని ఆయన ప్రశంసించారు. సైబర్ క్రైమ్ స్టేషన్ సిబ్బంది ప్రొఫెషనల్ నైపుణ్యం, సాంకేతిక అవగాహన, సమన్వయంతో పని చేయడం వలననే ఈ మోసగాడు గుప్తచారంగా దొరికాడని సీపీ పేర్కొన్నారు.

# ఖమ్మంలో ఆధునిక టెక్నాలజీ సెంటర్

## యువతకు నైపుణ్య శిక్షణ కేంద్రాల ప్రారంభం

- ఏటీసీ ద్వారా ఉపాధి అవకాశాలను అందించాలి
- భవిష్యత్ సాంకేతికతకు యువతను సిద్ధం
- ప్రజా ప్రభుత్వం ఆధ్వర్యంలో నైపుణ్య ప్రాజెక్టులు
- ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో 4 ఏ.టి.సి. సెంటర్లు ఏర్పాటు
- రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార మంత్రి తుమ్మల నాగేశ్వర రావు





**ఖమ్మం,మహా:** రాబోయే టెక్నాలజీకి అనుగుణంగా విద్యార్థులను సిద్ధం చేసేలా ఏ.టి.సి. ని ఏర్పాటు చేయడం జరిగిందని రాష్ట్ర వ్యవసాయ, మార్కెటింగ్, సహకార, చేనేత జౌళి శాఖల మంత్రి తుమ్మల నాగేశ్వర రావు తెలిపారు. మంత్రివర్యులు, సోమవారం ఖమ్మం నగరంలోని ప్రభుత్వ ఐటిఐ ప్రాంగణంలో నూతనంగా నిర్మించిన అడ్వాన్స్డ్ టెక్నాలజీ సెంటర్ ను జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి, పోలీస్ కమీషనర్ సునీల్ దత్ లతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి తుమ్మల నాగేశ్వర రావు మాట్లాడుతూ నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు దక్కాలంటే రొటీన్ గా ఉన్న ఐటిఐ కోర్సులు కాకుండా ప్రస్తుత పరిశ్రమల అవసరాల ప్రకారం నైపుణ్య కోర్సులను డిజైన్ చేయించి ఆధునిక సాంకేతిక కేంద్రాల ద్వారా అందించడం జరుగుతుందని అన్నారు. రాబోయే 5 నుంచి 10 సంవత్సరాల వరకు ప్రపంచీకరణలో జరిగే మార్పులకు అనుగుణంగా ఏటీసీ కోర్సులు డిజైన్ చేయడం జరిగిందని అన్నారు. ప్రపంచంలో మారుతున్న సాంకేతికతకు అనుగుణంగా మన యువతను సిద్ధం చేయాల్సిన అవసరం ఉందని మంత్రి తెలిపారు.ఆధునిక సాంకేతిక కేంద్రంలో అందించే కోర్సులను పూర్తి చేసే ముందే విద్యార్థులకు ఉపాధి అవకాశాలు లభించేలా టాటా సంస్థతో ప్రభుత్వం ఒప్పందం చేసుకుందని అన్నారు. నిర్వీర్యమైన ఐటిఐలను యువత కు ఉపయోగపడే విధంగా ప్రస్తుత టెక్నాలజీకి అనుగుణంగా సీఎం రేవంత్ రెడ్డి నాయకత్వంలో ప్రజా ప్రభుత్వం తీర్చిదిద్దిందని అన్నారు.యువతకు ప్రపంచం లో ఎక్కడైనా బ్రతికే శక్తి సామర్థ్యాలు అందించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి స్కిల్ డెవలప్మెంట్ కు ప్రాధాన్యత కల్పించారని అన్నారు. ప్రస్తుతం ఏసీ లకు చాలా డిమాండ్ ఉందని అన్నారు. ఎలక్ట్రిక్ వాహనాల వైపు ప్రపంచం చూస్తుందని, దానికి సంబంధించిన మెకానిక్స్ లో మనం నిష్ణాతులం కావాలని మంత్రి అన్నారు. రాబోయే సాంకేతికతకు మన యువతను సిద్ధం చేయాలనే లక్ష్యంతో ప్రభుత్వం పని చేస్తుందని అన్నారు. యువత ఉపాధి కోసం చూడకుండా నైపుణ్యం సంపాదిస్తే పరిశ్రమలు మన వెంట వచ్చి మంచి వేతనాలు అందించి ఉపాధి కల్పిస్తారని మంత్రి తెలిపారు. ప్రస్తుత ఇంజనీరింగ్ కళాశాలలో విద్యార్థులకు డిమాండ్ తగ్గిపోయిందని, అక్కడ ప్రాక్టికల్స్ పరిజ్ఞానం తక్కువగా ఉండటం, కోర్సులు అప్ డేట్ కాకపోవడం వల్ల బీటెక్ చదివినా కూడా ప్రస్తుత పరిశ్రమల అవసరాలకు సరిపోవడం లేదని మంత్రి తెలిపారు. నిరుద్యోగ యువతకు మంచి నైపుణ్యాలు అందించాలని లక్ష్యంతో ఉమ్మడి ఖమ్మం జిల్లా పరిధిలో ఖమ్మం, మణుగూరు, భద్రాచలం, కొత్తగూడెం ప్రాంతాలలో 4 ఏ.టి.సి. లను ఏర్పాటు చేయడం జరిగిందని అన్నారు. జిల్లాలో ఉన్న పరిశ్రమలకు అవసరమైన ఉపాధి ట్రైనింగ్ శిక్షణ విద్యార్థులకు అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి సూచించారు. ఏటీసీ కేంద్రంలో ఉన్న కోర్సుల ద్వారా ప్రపంచంలో ఎటువంటి అవకాశాలు అందుబాటులో ఉంటాయో విద్యార్థులకు వివరించేలా డిస్ ప్లే





బోర్డులు ఏర్పాటు చేయాలని అన్నారు. ఇంజనీరింగ్ కోర్సుల కన్నా మెరుగైన నైపుణ్య కోర్సులు ఏటిసిలో అందుబాటులో ఉన్నాయని, వీటిని విద్యార్థులు పూర్తి స్థాయిలో సద్వినియోగం చేసుకోవాలని మంత్రి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో నగర మేయర్ పునుకొల్లు నీరజ, మున్సిపల్ కార్పొరేషన్ కమీషనర్ అభిషేక్ అగస్త్య, ఏటిసి ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, విద్యుత్ శాఖ ఎస్ఇ శ్రీనివాస చారి, ఆర్ అండ్ బి ఎస్ఇ యాకోబు, ఖమ్మం ఆర్డీవో నర్సింహారావు, కార్మిక శాఖ సహాయ కమీషనర్ కృష్ణవేణి, స్థానిక కార్పొరేటర్ సత్యనారాయణ, ఖమ్మం అర్బన్ మండల తహసీల్దార్ సైదులు, ప్రజా ప్రతినిధులు, సంబంధిత శాఖల అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## న్యాయం చేయండి



**కొత్తగూడెం టౌన్, మహా:** కొత్తగూడెం నియోజకవర్గ పరిధిలోని రెండవ టౌన్ పోలీస్ సర్కిల్ ఇన్స్పెక్టర్ డి.ప్రతాప్ ని సోమవారం భారతరత్న అంబేద్కర్ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ తో పాటు మిత్ర బృందం మర్యాద పూర్వకంగా కలిసి సత్కరించి అభినందించి దళితుల బడుగు బలహీన వర్గాల సమస్యల గురించి చర్చించి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆచారి డాక్టర్ మద్దెల శివకుమార్ మాట్లాడుతూ తరాలు మారిన అంతరాలు మారడం లేదని స్వాతంత్రం వచ్చి 77 సంవత్సరాలు గడిచి హైటెక్ యుగంలో పయనిస్తున్న కూడా ఈ సమాజంలో దళితులకు, బడుగు బలహీన వర్గాలకు పేదవర్గాలకు అన్యాయం జరుగుతూనే ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వర్గాలకు చెందిన భూమి తగాదాల్లో గాని ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసుల్లో గానీ, వడ్డీ వ్యాపారస్తుల ధన దాహపు కోరల్లో నుండి విముక్తి కలిగించి ఆయా కేసుల్లో వారికి న్యాయం చేయాలని వాటిని న్యాయపరంగా సత్వరమే పరిష్కరించాలని సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రతాప్ కి విజ్ఞప్తి చేశారు. దీనిపై సర్కిల్ ఇన్స్పెక్టర్ ప్రతాప్ సానుకూలంగా స్పందించినట్లు ఆచార్య డాక్టర్ మద్దెల శివకుమార్ సంతోషాన్ని వ్యక్తపరిచారు. ఈ కార్యక్రమంలో గాంధీ పతం జిల్లా కన్వీనర్ చింతల చెరువు గిరిశం తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి కేసులో ఇద్దరిపై పీడీ యాక్ట్ కొనసాగింపు

**ఖమ్మం రూరల్, మహా:** గంజాయి అక్రమ రవాణా కేసులో ఇద్దరు నిందితులపై పీడీ యాక్ట్ కొనసాగుతున్నట్లు ఖమ్మం రూరల్ ఏసీపీ తిరుపతి రెడ్డి తెలిపారు. వివరాల ప్రకారం ఽ ఈ ఏడాది ఫిబ్రవరి 24న చేగొమ్మ ఎక్స్ రోడ్ వద్ద పోలీసులు వాహనాలను తనిఖీ చేస్తుండగా కూసుమంచి వైపు నుండి వస్తున్న కారును ఆపి పరిశీలించగా, దానిలో సుమారు 179 కిలోల గంజాయిని అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తించారు. దాని విలువ రూ.89 లక్షలు అని పోలీసులు తెలిపారు. ఈ ఘటనలో సిద్ధిపేట జిల్లా చిన్నకోడూరు మండలం మందపల్లి గ్రామానికి చెందిన పల్లపు రఘు (36) మరియు నల్లగొండ జిల్లా మిర్యాలగూడెం మండలం వెంకటాద్రిపాలెం గ్రామానికి చెందిన మహమ్మద్ ఖాజా పాషా (29)లను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. తదుపరి విచారణలో, నిందితులు అక్రమ రవాణా చర్యల్లో వరుసగా పాల్గొన్నట్లు నిర్ధారణ కావడంతో ఆగస్టు 26న కూసుమంచి పోలీసులు వారిపై పీడీ యాక్ట్‌ను అమలు చేశారు. సంబంధిత పత్రాలను కూసుమంచి ఇన్స్పెక్టర్ సంజీవ్, నెలకొండపల్లి ఎస్సై సంతోష్ అందజేసి నిందితులను చంచల్‌గూడ సెంట్రల్ జైలుకు తరలించారు. ఇదే విషయంపై తెలంగాణ రాష్ట్ర అడ్వైజరీ కమిటీ బోర్డు సమీక్ష జరిపి, ఇద్దరు నిందితులు పీడీ యాక్ట్ అమలుకు అర్హులని నిర్ధారిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు ఏసీపీ తిరుపతి రెడ్డి తెలిపారు.

## మున్సిపల్ కార్మికుల ఏరియర్స్ సమస్యలను పరిష్కరించాలి



**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో వివిధ మున్సిపాలిటీలలో పని చేస్తున్న కార్మికుల పియఫ్, పెండింగ్ ఏరియర్స్ సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో కార్మికులతో కలసి పోరాటాలకు సిద్ధమవుతామని సిఐటియు జిల్లా కార్యదర్శి ఏజె రమేష్ అన్నారు. సోమవారంస్థానిక శ్రామిక భవన్ లో మున్సిపల్ ఎంప్లాయిస్ అండ్ వర్కర్స్ యూనియన్ జిల్లా జనరల్ బాడీ సమావేశంలో ముఖ్య అతిథిగా ఆయన మాట్లాడారు. జిల్లాలోని మణుగూరు, ఇల్లందు మున్సిపాలిటీలలో 19 నెలల ఏరియర్స్ పెండింగ్ లో ఉన్నాయన్నారు ఈ సమస్యపై అనేక సార్లు అధికారులకు విన్నవించినా, దశల వారీగా పోరాటాలు చేసినా,గత్యంతరం లేక సమ్మె చేసినా ఆధికారులలో ఏమాత్రం చలనం లేదన్నారు. కార్మికులకు పెరిగిన వేతనాలను సకాలంలో ఇవ్వకపోగా, ఆ వేతనాలను ఏరియర్స్ రూపంలో ఇస్తామన్న హామీని విస్మరించారని మండిపడ్డారు. కార్మికుల పట్ల ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి ఎంత మాత్రం ఉన్నదో అర్ధమవుతున్న దన్నారు. కార్మికుల వేతనాల నుండి పియఫ్ కట్ అవుతున్నప్పటికీ, అంతే వాటా మున్సిపాలిటీ నుండి జమ కావడం లేదని తెలిపారు. ఈ సమస్య జిల్లాలోని అన్ని మున్సిపాలిటీలలో ఉన్నదని అన్నారు కార్మికులకు తోక చిట్టీలు ఇవ్వడం లేదన్నారు. ముప్పయ్ రెండు నెలలుగా పెండింగ్ లో ఉన్న ఈ సమస్యపై ఆధికారులు తక్షణమే దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. ఆదివారాలు, పండుగ సెలవులు కూడా ఇవ్వడం లేదని, పని చేస్తూ అనారోగ్యానికి గురై చనిపోయిన కార్మికుడి స్థానంలో వయసు అయిపోయి ఓపిక లేని కార్మికుల స్థానంలో వారి కుటుంబాల నుండి ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు వారసత్వ జిఓ ఉన్నప్పటికీ అమలు కావడం లేదన్నారు. పెరుగుతున్న ధరలకు అనుగుణంగా వేతనాలను నెలకు 26 వేల రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గద్దల శ్రీనివాసరావు, కొడిశాల రాములు, ఈశ్వర్ రావు, పాల్గొన్నారు.

## బీటీపీఎస్‌లో ఆదివాసి భూ కుంభకోణంపై చందా లింగయ్య దొర ఆగ్రహం



**మణుగూరు, మహా:** భద్రాద్రి థర్మల్ విద్యుత్ కేంద్రం (బీటీపీఎస్)లో జరిగిన భూముల కుంభకోణం, ఆదివాసి భూ నిర్వాసితులకు జరిగిన అన్యాయంపై ఆదివాసి జేఏసీ కన్వీనర్ చందా లింగయ్య దొర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆదివాసి భూ నిర్వాసితులు బీటీపీఎస్ గేటు ముందు ఆదివాసీ అఖిలపక్ష ప్రజాసంఘాల జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా జేఏసీ కన్వీనర్ చందా లింగయ్య దొర కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడారు. 2015లో టీఆర్ఎస్ ప్రభుత్వం ఆదివాసీల భూములను బలవంతంగా స్వాధీనం చేసుకుని దళారీల చేతుల్లోకి నెట్టిందని విమర్శించారు. మొత్తం 1116 మంది ఆదివాసీల భూములలో కేవలం 302 మందికి మాత్రమే ప్యాకేజీలు ఇచ్చారన్నారు. మిగతా 686 మంది భూ నిర్వాసితుల పట్ల జెన్కో, రెవిన్యూ అధికారులు అన్యాయం చేశారని ఆరోపించారు. భూమికి బదులుగా భూమి, ప్రతి కుటుంబానికి ఉద్యోగం, నెలకు ఐదు వేల రూపాయల జీవనోపాధి సహాయం, రెండు బెడ్‌రూం ఇండ్లు, అభివృద్ధి హామీలను కేవలం మాటలకే పరిమితం చేశారని విమర్శించారు. ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం కూడా ఈ అన్యాయంపై కనీస స్పందన చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. బీటీపీఎస్‌లో ఉన్న కాంట్రాక్టు పనులు, బూడిద రవాణా పనులను వీటిడీఏ సంఘాలకు కేటాయించాలని, బాధితులకు ప్యాకేజీలు, ఉద్యోగాలు వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. త్వరలో బీటీపీఎస్, జిల్లా కలెక్టరేట్, ఐటీడీఏ భద్రాచలం కార్యాలయాల ముందు ప్రత్యక్ష పోరాటం ప్రారంభిస్తామని హెచ్చరించారు. నిరసన సందర్భంగా బీటీపీఎస్ సీఇ బిచన్న నిరసన వేదిక వద్దకు వచ్చి ఆదివాసీల విజ్ఞప్తులను ఐటీడీఏ పీవో, కలెక్టర్, జెన్కో సీఎండీకి పంపి న్యాయం జరిగేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో గోండ్వాన సంక్షేమ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు పాయం సత్యనారాయణ, పొలిటికల్ జేఏసీ రాష్ట్ర అధ్యక్షుడు వాసం రామకృష్ణ దొర, జాతీయ ఆదివాసి గిరిజన అభ్యుదయ సంఘం జిల్లా నాయకులు కొమరం రామ్మూర్తి, డివిజన్ అధ్యక్షుడు కొమరం శ్రీను, మండల అధ్యక్షుడు కలేటి వీరయ్య, బీటీపీఎస్ వీటిడీఏ చైర్మన్ చిడెం నాగేశ్వరరావు, భూ నిర్వాసితుల కమిటీ అధ్యక్షురాలు కుంజ వెంకటరమణ, ఏనిక మంగమ్మ, పూనేం విజయలక్ష్మి, పోడియం బాలరాజు, వజ్జా శ్యామ్, మాజీ సర్పంచ్ కాయం తిరుపతమ్మ, పూనేం గోపాల్, పడిగ నారాయణ, కొమరం సైదులు, మడకం శ్రీను, ఈసం శశికుమార్ పాల్గొన్నారు.

## చేగొమ్మలో బీఆర్ఎస్‌కు షాక్..



**కూసుమంచి, మహా:** కూసుమంచి మండలం, చేగొమ్మ గ్రామంలో బీఆర్ఎస్ పార్టీకి కొందరు కార్యకర్తలు గుడ్ బై చెప్పి కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ మేరకు సోమవారం మంత్రి క్యాంప్ కార్యాలయం ఇంచార్జ్ తుంబురు దయాకర్ రెడ్డి సమక్షంలో కాంగ్రెస్ పార్టీ లో చేరగా కండువా కప్పి స్వాగతం పలికారు. మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆధ్వర్యంలో చేగొమ్మ గ్రామం అభివృద్ధి పథంలో ముందుకు వెళ్తుందని దయాకర్ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో నెలకొండపల్లి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ కొండపర్తి సురేష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు బొల్లికొండ శ్రీనివాస్ పాల్గొన్నారు.







# మణుగూరు పోలీస్ స్టేషన్‌పై మళ్లీ మచ్చ..!

- ఐదు నెలల్లో రెండు దఫాల ఏసీబీ ట్రాప్
- ఇప్పుడు కానిస్టేబుల్ లంచం స్క్రీన్‌షాట్‌తో హల్‌చల్..
- ఇద్దరు కానిస్టేబుల్ లపై చర్యలు తీసుకున్నాం: ఎస్డిపిఓ రవీందర్ రెడ్డి

**మణుగూరు, మహా:** ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఒకప్పుడు ప్రశాంతంగా పేరుపొందిన మణుగూరు పోలీస్ స్టేషన్ ఇప్పుడు వరస సంచలనాలతో రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. 2025 సంవత్సరం ఏప్రిల్ 21న మణుగూరు సర్కిల్ ఇన్‌స్పెక్టర్ ఏసీబీ ట్రాప్‌లో చిక్కుకోగా, కేవలం ఐదు నెలలకే వ్యవధి తేడాతో సెప్టెంబర్ 27న అదే స్టేషన్ ఎస్సై ఏసీబీ వలలో దొరికాడు. ఈ రెండు సంఘటనలు మరవకముందే మరో సంచలన ఆరోపణ మణుగూరు పోలీస్ శాఖను కుదిపేస్తోంది.

### ఫోన్‌పే లంచం స్క్రీన్‌షాట్‌తో కలకలం

మణుగూరు పట్టణంలో తాజాగా ఓ కానిస్టేబుల్ ఓ బాధితుడి నుండి రూ.5,000 డిమాండ్ చేసి, రూ.3,000 ఫోన్‌పే ద్వారా తీసుకున్నాడని సోషల్ మీడియాలో స్క్రీన్‌షాట్‌లు వైరల్ అవుతున్నాయి. దీంతో ప్రజల్లో పోలీస్ శాఖలో నెలకొన్న అవినీతిపై చర్చలు మిన్నంటాయి. ఇంతవరకూ కరెన్సీ నోట్లతో లంచం ఇక ఫోన్‌పేతోనా..? అంటూ నెటిజన్లు చురకలు వేస్తున్నారు.

### ముగ్గురు కానిస్టేబుళ్లపై విచారణ ప్రారంభం..?

ఫోన్ పే ద్వారా లంచం ఆరోపణల నేపథ్యంలో, సోమవారం ముగ్గురు కానిస్టేబుళ్లపై విచారణ ప్రారంభమైందని సమాచారం. జిల్లా ఎస్పీ ఈ వ్యవహారంపై తీవ్రంగా స్పందించినట్లు తెలుస్తోంది. ఇప్పటికే ఇద్దరు కానిస్టేబుళ్లు వివిధ ఆరోపణలపై ఎస్పీ కార్యాలయానికి అటాచ్ అయ్యారన్న విషయాన్ని మరవక ముందే రోజుల వ్యవధిలోనే. ఇప్పుడు మరో ముగ్గురు విచారణ ఎదుర్కొంటుండటంతో మణుగూరు పోలీస్ శాఖలో అంతర్గత కలకలం ముదురుతోంది.

### ఇటీవలే మరో వివాదం..!

ఇటీవలే, పోలీస్ స్టేషన్లోనే సీఐ, ఎస్సై సమక్షంలో రైతు, సింగరేణి ఉద్యోగి నాగేశ్వరరావుపై ఇసుక ర్యాంపు నిర్వాహకుడు గంట రమేష్ దాడి చేసిన ఘటన పెద్ద సంచలనంగా నిలిచింది. ఆ సంఘటన చల్లారకముందే తాజాగా ఈ లంచం ఆరోపణలు రావడంతో మణుగూరు స్టేషన్ పేరు మళ్లీ మచ్చతో ముడిపడింది.

### మణుగూరులో నిజాయితీ ఎక్కడ..?

ఒకప్పుడు ప్రజల భద్రతకు చిహ్నంగా నిలిచిన మణుగూరు స్టేషన్ ఇప్పుడు అవినీతి, వివాదాలు, ఏసీబీ ట్రాపులు, ఆరోపణలతో నిత్యం వార్తల్లో నిలుస్తోంది. అసలు ఈ స్టేషన్‌కి ఏమైంది..? అన్న ప్రశ్నలు ప్రజల నుంచి వెల్లువెత్తుతున్నయి. అక్రమార్కులకు అధికారుల అండదండలా..? అంటూ స్థానికులు ప్రశ్నిస్తున్నారు. వరస సంచలనాలతో ఇప్పుడు మణుగూరు పోలీస్ స్టేషన్ పేరు, ఉమ్మడి ఖమ్మం జిల్లా పోలీస్ చరిత్రలో ప్రత్యేక పేజీగా నిలిచిపోయేలా మారింది.

### ఇద్దరు కానిస్టేబుళ్లను ఎస్పీకి అటాచ్ చేసాం : మణుగూరు ఎస్డిపిఓ రవీందర్ రెడ్డి

ఓ బాధితుడు వద్ద నుంచి ఫోన్పే ద్వారా 3000 లంచంగా తీసుకున్న రామారావు కోటేశ్వరరావు అనే ఇద్దరు కానిస్టేబుళ్లను జిల్లా ఎస్పీ కార్యాలయానికి అటాచ్ చేసి బదిలీ చేసినట్లు మణుగూరు డిఎస్పి రవీందర్ రెడ్డి తెలిపారు. మూడు రోజులుగా సోషల్ మీడియాలో ఫోన్ పే లంచం స్క్రీన్ షాట్ మెసేజ్ లు చెక్కర్లు కొడుతున్న విషయం పై వివరణ అడగగా డి.ఎస్.పి పై విధంగా స్పందించారు.



## సహెూద్యోగుల పట్ల మానవత్వం

**మణుగూరు, మహా :** భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మణుగూరులో సింగరేణి ఎస్ అండ్ పిసి ప్రైవేట్ సెక్యూరిటీ గార్డులు మానవత్వానికి నిదర్శనంగా నిలిచారు. సహచర ఉద్యోగుల కుటుంబాలు ఎదుర్కొన్న దుఃఖంలో భాగస్వాములవుతూ, తమ వేతనాలనుండి మొత్తం రూ.66,600 లు సేకరించి సోమవారం ఆర్థిక సహాయం అందజేశారు. ఇటీవల ఎం రాజనర్సు, ఎం విశ్వేశ్వరరావు తండ్రి మాటేటి నరసయ్య మరణించగా, బి రమేష్ బాబు తల్లి, తండ్రి ఇద్దరూ వారంరోజుల వ్యవధిలో కన్నుమూయడంతో బాధిత కుటుంబాలకు సిబ్బంది సాంత్వన అందించారు. రాజనర్సుకు రూ. 16,900, విశ్వేశ్వరరావుకు రూ.16,900, రమేష్ బాబుకు రూ.32,800 రూపాయలు అందజేశారు. తమ తక్కువ జీతాల మధ్యనుండి చేసిన ఈ దానం మానవీయతకు నిదర్శనంగా నిలిచింది. సహెూద్యోగుల కష్టసుఖాల్లో తోడుగా ఉండడం ద్వారా సెక్యూరిటీ సిబ్బంది నిజమైన సామాజిక బంధాన్ని చాటారు. కార్యక్రమంలో సింగరేణి అధికారులు, ఎస్ అండ్ పిసి జమిదారులు, ప్రైవేట్ సెక్యూరిటీ సూపర్వైజర్లు రామవుతార్ పాల్గొన్నారు.

మహా పత్రిక
ANN తెలుగు

# ఖమ్మం డిగ్రీ కాలేజ్ మైదానం దోపిడీ కేంద్రమా?

- బాణాసంచా సిండికేట్ మాయాజాలం బహిర్గతం..!
- అధికారుల పేర్లతో అక్రమ వసూళ్లు..!
- ప్రతి షాపు నుంచి 30 వేల దాకా వసూల్..!
- ప్రభుత్వ స్థలం ప్రైవేట్ ముఠా ఆధీనంలో..!

**మ్మం బ్యూరో, మహా:** ఖమ్మం నగరంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానం ఇప్పుడు విద్యా క్షేత్రం కాదు, వసూళ్ల అడ్డాగా మారిపోయిందనే ఆరోపణలు ఊపందుకున్నాయి. ప్రభుత్వ భూమిలో ప్రజల భద్రత పేరుతో, అధికారులు పేరుతో, మున్సిపల్ ముద్రతో సిండికేట్ ముఠా బాణాసంచా వ్యాపారాల పేరుతో అక్రమ వసూళ్ల సిందూరం రాసుకుంటోందట. ప్రతీ షాప్ కేటాయింపుకు 20 నుంచి 30 వేల రూపాయల వరకూ వసూళ్లు జరగగా, ప్రభుత్వ ఖజానాకు మాత్రం కొద్ది రూపాయలే చేరాయట! "అధికార అనుమతి" పేరుతో ప్రజలను, వ్యాపారులను భయపెట్టి, మైదానం మొత్తాన్ని దోపిడీ రాజ్యంగా మార్చిన సిండికేట్ దందా ఇప్పుడు వెలుగులోకి రావడంతో ఖమ్మం ప్రజలు షాక్ అవుతున్నారు. విద్యా సంస్థ స్థలాన్ని వ్యాపార మైదానంగా మలిచిన ఈ కుతంత్రం వెనుక ఎవరి ఆశీర్వాదం ఉందనే ప్రశ్నే ఇప్పుడు అందరిలోనూ చర్చనీయాంశమైందిలి



### వసూళ్లే లక్ష్యంగా బాణాసంచా వ్యాపారం

ఈ నెల 8 నుంచి 21 వరకు కళాశాల మైదానంలో బాణాసంచా మార్కెట్ ఏర్పాటు పేరుతో దుకాణాల కేటాయింపులు జరిగాయి. అయితే, ఈ కేటాయింపులు పారదర్శకంగా కాకుండా సిండికేట్ ఆధీనంలో జరిగాయని వ్యాపారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒక్క షాప్‌కే సుమారు 30 వేల రూపాయల వరకు "సిండికేట్ ఫీజు" పేరుతో వసూల్ చేశారని తెలుస్తోంది. మొత్తం 44 లక్షల రూపాయలు సేకరించగా, అందులో కేవలం 4.5 లక్షలు మాత్రమే ప్రభుత్వ ఖజానాకు చేరాయట. మిగతా మొత్తం ఎక్కడికి పోయిందన్నదే ఇప్పుడు పెద్ద మిస్టరీగా మారింది.

### అధికారుల పేర్లతో భయపెట్టి వసూళ్లు..!

ఫైర్, ట్రాఫిక్, పోలీస్, మున్సిపల్ శాఖల పేర్లు చెప్పి వ్యాపారులను భయపెట్టి వసూళ్లు చేసినట్టు ఆధారాలు బయటపడ్డాయి. "ఫైర్ సేఫ్టీ ఇన్‌స్పెక్షన్ ఫీజు", "ట్రాఫిక్ పాస్", "మున్సిపల్ అనుమతి" పేర్లతో ఒక్కో షాప్ నుంచి వేర్వేరు మొత్తాలను వసూల్ చేశారని సమాచారం. అధికారిక డీడీలు మాత్రం నాటకం కోసం మాత్రమే జారీ చేసినట్లు అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. కళాశాల అధికారుల మౌనం, స్థానిక ప్రజాప్రతినిధుల నిశ్శబ్దం ఈ వ్యవహారంపై మరింత అనుమానాలను రేకెత్తిస్తోంది.

### ప్రైవేట్ ముఠా ఆధీనంలో ప్రభుత్వ స్థలం...

ప్రభుత్వ డిగ్రీ కాలేజ్ మైదానం, పెవిలియన్ గ్రౌండ్ రెండూ సిండికేట్ ఆధీనంలో ఉన్నాయట. ఒక్క అద్దె రూపాయి కూడా చెల్లించకుండా మొత్తం స్థలాన్ని ఆక్రమించి షాపులు కేటాయించినట్టు సమాచారం. అధికారిక అనుమతులు లేకుండానే ఆన్లైన్ అప్లికేషన్ లింక్‌లు సృష్టించి ప్రజలను మోసం చేశారని కూడా ఆరోపణలు వస్తున్నాయి. సిండికేట్ నేతలు ఒక్కొక్కరు ఐదు బినామీ షాపులు కలిగి ఉన్నారని, ఆదాయంలో ఎక్కువభాగం వ్యక్తిగత ఖాతాల్లోకి వెళ్తోందని స్థానికులు చెబుతున్నారు.

### వాణిజ్య కేంద్రంగా విద్యా స్థలం..!

విద్యార్థుల క్రీడా కార్యక్రమాల కోసం ఉద్దేశించిన కళాశాల మైదానం, ఇప్పుడు వ్యాపార మైదానంగా మారిపోయింది. విద్యార్థి సంఘాలు దీని పై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నాయి. "విద్యా సంస్థ స్థలాన్ని వ్యాపార దందాకు వాడుకోవడం సిగ్గుచేటు" అని విద్యార్థి నేతలు ఆరోపిస్తున్నారు. ఈ వ్యవహారంపై ఉన్నత విద్యా శాఖ తక్షణం విచారణ జరిపించాలని, ప్రభుత్వ ఆదాయానికి జరిగిన నష్టాన్ని భర్తీ చేయాలని వారు డిమాండ్ చేస్తున్నారు.

### విచారణ తప్పనిసరి అంటున్న ప్రజా సంఘాలు

ఈ వ్యవహారం పై ప్రజా సంఘాలు కూడా గళమెత్తాయి. "ప్రభుత్వ ఆదాయాన్ని దోచుకుంటున్న సిండికేట్ ముఠాను విచారణ లేకుండా వదిలేస్తే, భవిష్యత్తులో ప్రభుత్వ ఆస్తులు మాఫియా చేతుల్లో పడతాయి" అని హెచ్చరిస్తున్నాయి. సిండికేట్ చేతుల్లో నలిగిపోయిన వ్యాపారులు, మైదానం సిబ్బంది ఇప్పుడు న్యాయం కోసం ఎదురు చూస్తున్నారు. ఖమ్మం ప్రభుత్వ డిగ్రీ కళాశాల మైదానంలో జరుగుతున్న బాణాసంచా మార్కెట్ దందా కేవలం ఒక వాణిజ్య అవకతవకం మాత్రమే కాదు ఇది విద్యా సంస్థల గౌరవాన్ని దెబ్బతీసే దోపిడీ వ్యవస్థకు ప్రతీక. ప్రభుత్వ భూములు ఇలా ముఠాల చెరలో పడితే, ప్రజా సంపద భద్రత ఎక్కడ? ఈ కేసు కేవలం వసూళ్ల దందానే కాదు, ప్రభుత్వ నిర్లక్ష్యానికి, రాజకీయ ఆశ్రయానికి కూడా నిదర్శనం. ఇప్పుడు ప్రజలు ఎదురుచూస్తున్నది ఒకటే "ఖమ్మం సిండికేట్ దోపిడీపై కఠిన విచారణ, కఠిన శిక్ష."

## రాష్ట్ర టీజీవో నేతకు సన్మానం



**కారేపల్లి, మహా:** రాష్ట్ర టీజీవో కార్యవర్గ సభ్యులు శేషుప్రసాద్ ను కారేపల్లి జూనియర్ కళాశాలలో సోమవారం సన్మానించారు. కారేపల్లి జూనియర్ కళాశాలలో లైబ్రెరియన్ గా పని చేస్తున్న శేషుప్రసాద్ టీజీవో కార్యవర్గంలో ఏకగ్రీవంగా ఎన్నికైనారు. అయనన కళాశాల ప్రిన్సిపాల్ విజయకుమారి ఆధ్వర్యంలో సన్మానించారు. ఈసందర్బంగా శేషుప్రసాద్ మాట్లాడుతూ ఆధ్యాపకులు, ఉద్యోగ సమస్యల పరిష్కారంకు యూనియన్ ఆధ్వర్యంలో ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకరానున్నట్లు తెలిపారు. తనను రాష్ట్ర కార్యవర్గంలో ఎన్నికకు సహకరించిన ప్రతి ఒక్కరి కృతజ్ఞతలు తెలిపారు.

## చెరువు తలపిస్తున్న అంతర్గత రహదారి



**కారేపల్లి, మహా:** సైడు కాలువలు లేక అంతర్గత రహదారులపై వర్షం నీరు నిలిచి చెరువులను తలపిస్తున్న ఘటన కారేపల్లి మండలం మాధారంలో కనిపిస్తుంది. మాధారం గ్రామంలో అంతర్గత రహదారులు సీసీ రోడ్లుగా మారినా వాటికి సైడు కాలువలు నిర్మించలేదు. దీంతో మాధారం బడ్రాయి సెంటర్ నుండి గోవింద్‌తండా వెళ్ళు దారిపై వర్షపు నీరు నిలిచి పాదచారులు, వాహన దారులకు ఇబ్బందులు కల్గిస్తుంది. రోడ్డుపై నిలిచి నీరు ఇండ్లలోకి వెళ్తుండటంతో ఆప్రాంత నివాసులు ఇండ్లలోకి నీరు రాకుండా ఇండ్ల చుట్టు మరం పోసుకోవల్సిన పరిస్ధితి కనిపిస్తుంది. గ్రామంలో సైడు కాలువలు నిర్మించాలని ప్రజాప్రతినిధులు, అధికారులకు ఎన్ని సారు విన్నవించిన ఫలితం లేకుండా పోయిందని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## షాపు ముందు పెట్టిన మోటర్ సైకిల్ మాయం

**కారేపల్లి, మహా:** షాపు ముందు పెట్టిన మోటర్ సైకిల్ మాయమైన ఘటన ఆదివారం రాత్రి కారేపల్లిలో చోటుచేసుకుంది. కారేపల్లి అంబేద్కర్ సెంటర్‌లో కనకదుర్గ ఫాస్ట్ ఫుడ్ సెంటర్ ముందు యాజమాని నూకల శ్రీధర్ తన మోటర్ సైకిల్ నిలిపాడు. తెల్లవారి చూచే సరికి షాపు ముందు ఉంచిన వాహనం లేక పోవటంతో ఎంత వాకబు చేసినా ఫలితం లేకుండా దీంతో బాధితుడు కారేపల్లి పోలీస్ స్టేషన్‌లో పిర్యాదు చేశాడు.

## మైనర్ గిరిజన బాలికల ఆచూకీ లభ్యం



**దమ్మపేట, మహా :** మండల పరిదిలోని అంకంపాలెం గిరిజన గురుకుల బాలికల జూనియర్ కళాళాలలో ఇద్దరు మైనర్ బాలికలు అదృశ్యమైన ఘటన స్ధానికంగా కలకలం రేపిన సంగతి గ్రామస్ధులు మరువక ముందే పోలీసులు బాలికల ఆచూకీ తెలుసుకున్నారు. ఖమ్మం బస్టాండ్ లో పోలీసులు గాలింపు లు చేయగా బస్టాండ్ లో సోమవారం రాత్రి పట్టుబడ్డారు.. దీంతో కళాశాల యాజమాన్యం ,విద్యార్థుల తల్లిదండ్రులు ఊపిరి పీల్చుకున్నారు. అధికారికంగా పూర్తి వివరాలను పోలీసులు వివరించాల్సి ఉంది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి పట్టణ సమీపంలోని రేగళ్ళపాడుకు చెందిన ఇద్దరు గిరిజన మైనర్ బాలికలు ,దమ్మపేట మండలం అంకంపాలెం లో ఉన్న గిరిజన బాలికల గురుకుల జూనియర్ కళాశాలలో ఇంటర్ చదువుచున్నారు. పాఠశాల అధ్యాపక బృందానికి సమాచారం ఇవ్వకుండా ఆదివారం బయటకు వెళ్ళారు. ఎంతసేపటికి తిరిగి రాకపోవడంతో అనుమానం వచ్చి విద్యార్ధినిల తల్లిదండ్రులకు విషయం తెలియజేశారు. తల్లిదండ్రులు ,బంధువుల తో కలిసి చుట్టుపక్కల పల్లెల్లో ,గ్రామాల్లో ఆచూకీ కోసం యత్నాలు చేశారు. ఎంతకీ ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఆదివారం రాత్రి షుమారుగా 11 గం.ల సమయంలో దమ్మపేట పోలీసులకు లెక్చరర్ బాణోత్ హరిత ఫిర్యాదు చేశారు. ఉపాద్యాయ సిబ్బంది ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి ధర్యాప్తు చేస్తున్నారు.

## ఖమ్మం మమత సెంటర్‌లో మారణాయుధాలతో దాడి



**ఖమ్మం, మహా:** ఖమ్మం నగరంలోని మమత సెంటర్‌లో సోమవారం రాత్రి ఇద్దరు వ్యక్తులు మారణాయుధాలతో పరస్పరం దాడి చేసుకున్నారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారుతుండగా, అక్కడికొచ్చిన టాస్క్‌ఫోర్స్ ఆర్ఎస్ఐ సతీష్ సిబ్బంది తక్షణమే స్పందించి ఒకరిని ప్రాణాపాయం నుండి కాపాడారు. ఖమ్మం పోలీస్ కమిషనరేట్ పరిధిలో ఎలాంటి అసాంఘిక కార్యకలాపాలు జరగకుండా నిరోధించేందుకు కమిషనర్ సునీల్ దత్ ఆధ్వర్యంలో పోలీస్ బృందాలు రౌండ్‌ది క్లాక్ గస్తీ నిర్వహిస్తున్నాయి. పెట్రోలింగ్ బలగాలు ఘటన జరిగిన కొన్ని క్షణాల్లోనే అక్కడికి చేరుకొని దాడి చేసుకున్న వారిని చెదరగొట్టాయి. ప్రస్తుతం ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు కొనసాగిస్తున్నారు. సామాన్యుల భద్రత కోసం పోలీసులు ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉన్నారని అధికారులు తెలిపారు.